సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 20-1-2023 ₹15/-









## హల్ద్వానీలో అరాచకం



మాదక ద్రవ్యాల ఊబిలో యువతరం




దిశా నిర్దేశం చేస్తున్న దివ్య ఖుర్‌ఆన్

సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Email : geeturaiweekly@gmail.com

Website: www.tiptrust.in

సంపుటి 45 సంచిక: 3 హైదరాబాద్
శుక్రవారం 20 జనవరి 2023 రూ.15-00
27 జమాదిఉల్ ఆఖిర్ 1444 హిజ్రీ


**తొలిగీటు**

సదాచరణను
మీ శక్తిమేరకు
పాటించండి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


కథ



12

**మనసున మనసై (కథ)**

## లోపల...


| | | |
|---|---|---|
| జోడో యాత్ర | ...... | 04 |
| హల్ద్వానీలో అరాచకం | ...... | 05 |
| మాదకద్రవ్యాల ఊబిలో యువతరం | ...... | 08 |
| గాలి విషమైతే... | ...... | 14 |
| మేరె అల్లాహ్ బరాయీ సే బచానా ముఝ్‌కో | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| మహోన్నత విజయం | ...... | 20 |
| అమూల్య వరాలు అమ్మానాన్నలు | ...... | 24 |
| దిశానిర్దేశం చేస్తున్న దివ్యఖుర్‌ఆన్ | ...... | 26 |
| ఆడపిల్లలు ఉన్న ఇల్లే అందమైన ఇల్లు | ...... | 28 |
| ఖుర్‌ఆన్ పట్ల మక్కువ | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| యువతకు వారధి ఐవైయం | ...... | 34 |


**సిమ్ము మారుస్తున్న శీనన్న.?**




(ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి కాషాయ కండువా కప్పుకోనున్నట్లు టాక్)

ఆఫర్ మారిందంట
సిగ్నెలు పోతున్నది
బీఆరెస్ ఆఫీసుకు
లైను కటౌతున్నది!
కాషాయం వైపుకు
కనెక్ట్ అవుతున్నది
ఎందుకో ఈమధ్య
అటే లాగుతున్నది!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## జోడో యాత్ర

**భారత్ జోడో** యాత్ర వల్ల మీ ఇమేజ్‌లో మార్పు వచ్చిందా అని ఒక జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు రాహుల్ గాంధీ జవాబు చాలా మందికి విచిత్రంగా వినిపించింది. ఈ ప్రశ్నకు జవాబిస్తూ రాహుల్ "మీరు రాహుల్ గాంధీని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రశ్న అడిగారు. నేను ఆ రాహుల్ గాంధీని చంపేశాను. అతను లేడు. మీరు చూస్తున్నది రాహుల్ గాంధీని కాదు... మీకు అర్థం కాలేదా? హిందూ ధార్మిక గ్రంథాలు చదవండి. పరమేశ్వరుడి గురించి చదవండి. ఆశ్చర్యపోవద్దు... రాహుల్ గాంధీ మీ బుర్రలో ఉన్నాడు, బీజేపీ బుర్రలో ఉన్నాడు... నా బుర్రలో లేడ" ని జవాబిచ్చాడు. అంతేకాదు తన ఇమేజ్ గురించి తాను పట్టించుకోవడం లేదని అన్నారు. జనవరి 8వ తేదీన ఆయన చేసిన మరో వ్యాఖ్య కూడా గమనించదగింది. ఇండియా తపస్వుల దేశం అని పూజారుల దేశం కాదని అన్నారు. బీజేపీ ప్రతినిధి షహజాద్ పూనావాలా దీన్ని రాజకీయం చేయడానికి పూజారులను అవమానించారని గగ్గోలు చేసే ప్రయత్నం చేశాడు.

రాహుల్ గాంధీ ఇచ్చిన ఈ రెండు సమాధానాలు తాత్విక భూమిక కలిగి ఉన్నాయన్నది ఎంత నిజమో, రాజకీయ సందేశాన్నిస్తున్నాయన్నది కూడా అంతే నిజం. హిందువుల పార్టీగా చెప్పుకునే బీజేపీలో ధార్మిక గ్రంథాల అధ్యయనం ఉందా అనే ప్రశ్న ఆయన ప్రజల మనస్సులో కలిగేలా చేశారు. భారత్ జోడో యాత్ర ప్రారంభమైనప్పుడు దీనివల్ల కాంగ్రెసుకు ప్రయోజనమేమిటి? అనే ప్రశ్నలు వచ్చాయి. గుజరాత్ ఓడి పోయారు, హిమాచల్‌లో ఎలాగోలా గెలిచారు. ఈ రెండు రాష్ట్రాలను భారత్ జోడో యాత్ర పట్టించుకోలేదు. కాని నెల రోజుల తర్వాత భారత్ జోడో యాత్ర అనేక మంది దృష్టిని ఆకట్టుకుంది. ఒక సామాజిక ప్రయోగంగా ప్రశంసలు పొందు తోంది. ఈ యాత్రకు రాజకీయాలతో సంబంధం లేదని రాహుల్ గాంధీ చాలా తెలివిగా రాజకీయాలను దూరంగా ఉంచారు. దేశంలో సోదరభావాన్ని పెంచడానికి ఉద్దేశించిన యాత్రగా చిత్రీకరించడంలో విజయం సాధించారు. తుకడే తుకడే గ్యాంగుల వంటి ప్రచారంతో రాజకీయ లబ్ది పొందుతున్న బీజేపీకి ఈ జోడో నినాదం ఇప్పుడు బెదురు పుట్టించే స్థాయికి చేరుకుంది. అందువల్లనే కోవిడ్ నిబంధనలు ముందుకు తీసుకువచ్చారు.

గత నాలుగు నెలలుగా రాహుల్ గాంధీ ప్రజాదరణ పెరిగింది. కాని ఎన్నికల్లో ఈ ప్రజాదరణ గెలుపుసాధించకపోతే దీనికి అర్థమే ఉండదు. 2023లో తొమ్మిది రాష్ట్రాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇందులో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెసు తన అధికారం కాపాడుకోవాలి. కర్నాటక, మధ్య ప్రదేశ్, త్రిపురల్లో బీజేపీని మట్టి కరిపించాలి. ఇలా జరక్కపోతే భారత్ జోడో యాత్రకు అర్థమే ఉండదు. కాంగ్రెసు కొత్త శక్తి పుంజుకుందనే సందేశం ప్రజల్లోకి వెళ్ళాలి. బీజేపీని ఢీకొనే వనరులు కాని, డబ్బు కాని కాంగ్రెసుకు లేదు. కాని భారత్ జోడో యాత్ర కాంగ్రెసు శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపడం వల్ల ఎన్నికల్లో ఫలితాలు సాధిస్తారనే నమ్మకాన్ని ఇచ్చింది. 2024 ఎన్నికల్లో బీజేపీని ఢీకొనే పార్టీగా కాంగ్రెసు నిరూపించు కుంటుందా?

ప్రతిపక్షాల ఐక్యతకు 2023 అవకాశం ఇవ్వవచ్చు. దాదాపు 200 లోక్‌సభ స్థానాలు ఉత్తరాది రాష్ట్రాల్లో ఉన్నాయి. ఇక్కడ బీజేపీతో కాంగ్రెసుకు సరాసరి పోటీ ఉంది. కాబట్టి కాంగ్రేసేతర ప్రతిపక్షాల వేదిక ఉత్తరాది రాష్ట్రాల్లో ఎలాంటి రాజకీయాలకు దారితీస్తుందన్నది వేచి చూడాలి. కాంగ్రెసుతో చేతులు కలప డానికి ఉత్తరాది ప్రాంతీయ పార్టీలు సిద్ధంగా ఉన్నాయా అన్నది మరో ప్రశ్న.

భారత్ జోడో యాత్ర తర్వాత చాలా మందికి కాంగ్రెసు బలమైన ప్రతిపక్షంగా కనిపిస్తోంది. భారత్ జోడో యాత్రలోని సామ రస్యం, సుహృద్భావం, ప్రేమ శాంతి సందేశం చాలా మందిని ఆకట్టుకుంది. భారత్ జోడో యాత్రకు వ్యతిరేకంగా బీజేపీ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. కాంగ్రెసు యాత్రగా ప్రారంభ మైనప్పటికీ అనేక పౌరసంఘాలు, నటులు, ప్రొఫెషనల్స్ యాత్రలో పాల్గొన్నారు. కాంగ్రెసు వ్యతిరేకతతో పుట్టిన సమాజ వాది పార్టీ, రాష్ట్రీయజనతాదళ్, బహుజనసమాజ్ పార్టీ, శివసేన వంటి పార్టీలు కూడా ఈ యాత్రను స్వాగతించాయి. మద్దతు పలికాయి. జోడో యాత్ర బీజేపీకి వ్యతిరేకంగా రాజకీయ సమీకరణాలకు దారితీస్తోంది. కాని ఎన్నికల్లో గెలుపొందడానికి ఇది మాత్రమే సరిపోదు. ఒక బలమైన ప్రతిపక్షంగా కాంగ్రెసు ఓటర్లను తన వైపు తిప్పుకోడానికి ఏం చేస్తుందన్నది వేచి చూడాలి.

అబ్దుల్ వాహెద్




# హల్ద్వానీలో అరాచకం

**ఉత్తరాఖండ్‌లోని** హల్ద్వానీలో వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యే పరిస్థితిని సుప్రీంకోర్టు ఉత్తర్వు కాపాడింది. రైల్వే విభాగానికి, అక్కడి నివాసులకు మధ్య ఉన్న భూ వివాదంలో హల్ద్వానీ ప్రజలు అక్కడి నుంచి ఖాళీ చేయాలని ఉత్తరాఖండ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు నిలిపివేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులను జమాఅతె ఇస్లామీ హింద్ స్వాగతించింది. ఒక మీడియా సమావేశంలో జమాఅతె ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షులు ముహమ్మద్ సలీమ్ మాట్లాడుతూ హల్ద్వానీలో ఇళ్ళ కూల్చివేతను అడ్డుకున్న సుప్రీంకోర్టు ఆదేశాలు న్యాయస్థానాల పట్ల ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచాయని అన్నారు.

యాభై వేల మంది ప్రజలను రాత్రికి రాత్రి ఇండ్ల నుంచి బయటకు పంపేయడం సాధ్యం కాదని, ఇది మానవీయ సమస్య అని, ఈ సమస్య పరిష్కారానికి ఆచరణాత్మకంగా వ్యవహరించాలని, దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న వారిని అర్ధ సైనికబలగాలతో ఇళ్ళు ఖాళీ చేయిస్తామనడం సముచితం కాదని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ చెప్పిన మాటలను ప్రొఫెసర్ సలీం స్వాగతించారు. హల్ద్వానీలో ఇళ్ళ కూల్చివేత నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఆయన చెప్పారు. వార్తా కథనాల ప్రకారం 4500 ఇళ్ళు, 4 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రైవేటు పాఠశాలలు, ఒక బ్యాంకు, రెండు వాటర్ ట్యాంకులు, 10 మస్జిదులు, 4 మందిరాలు, అనేక దుకాణాలు కూల్చివేతల జాబితాలో ఉన్నాయి. అధికారులు ఉత్తరాఖండ్ హైకోర్టు ఆదేశాలను తీసుకుని కూల్చివేతలకు సిద్ధమవుతున్నారు. కాని అంత పెద్ద సంఖ్యలో ప్రజల ఇళ్ళు కూల్చివేసి నిరాశ్రయులను చేయడం అమానుషం అవుతుందని, ఇది నైతికతకు, న్యాయానికి విరుద్ధమని జమాఅత్ ఉపాధ్యక్షులు చెప్పారు.

జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఒక నిజనిర్ధారణ కమిటీ కూడా హల్ద్వానీ సందర్శించింది. జమాఅత్ జాతీయ కార్యదర్శి మలిక్ ముఅతసిమ్ ఖాన్, సీనియర్ జర్నలిస్టు ప్రశాంత్ టాండన్, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ జాతీయ కార్యదర్శి నదీమ్ ఖాన్, SPECT ఫౌండేషన్‌కు చెందిన లాయక్ అహ్మద్ ఖాన్, జమాఅత్ జాతీయ సహాయ కార్యదర్శి ఇనాముర్రహ్మాన్

ఖాన్‌లు ఈ కమిటీలో ఉన్నారు. ఈ డిమాలిషన్ కార్యక్రమంలో చాలా లోపాలను నిజనిర్ధారణ సంఘం బయటపెట్టింది. సరైన ప్రక్రియను అనుసరించలేదని పేర్కొంది. వెంటనే కూల్చివేతల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది. రైల్వే అధికారులకు, స్థానిక ప్రజలకు మధ్య చర్చలు సంప్రదింపుల ద్వారా సరైన పరిష్కారాన్ని కనుగొనాలని కోరింది.

సుప్రీంకోర్టు జనవరి 5వ తేదీన ఈ కూల్చివేతలను నిలుపు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హల్ద్వానీలోని బంభుల్‌పురాలో ఈ కూల్చివేతలకు అధికారులు ప్రయత్నించారు. రైల్వే భూమిని అక్కడి స్థానికులు దురాక్రమించుకున్నారన్నది ఆరోపణ. వెంటనే ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. డిసెంబర్ 20వ తేదీన ఉత్తరాఖండ్ హైకోర్టు వెంటనే ఆ భూమిని ఖాళీ చేయించాలని అవసరమైతే అర్ధసైనిక బలగాల సహాయం తీసుకోవాలని కూడా తన ఉత్తర్వుల్లో పేర్కొంది. కాని, ఎలాంటి పునరావాస పథకం లేకుండా యాభై వేల మందిని ఎలా ఖాళీ చేయిస్తారని సుప్రీం కోర్టు ప్రశ్నించింది.

హల్ద్వానీలోని బంభుల్‌పుర ప్రజలు హైకోర్టు ఉత్తర్వుల తర్వాత నిద్రలేని రాత్రులు గడిపారు. అక్కడ వాళ్ళు తరతరాలుగా ఉంటున్నారు. పిల్లాపాపలను వెంటబెట్టుకుని ఎక్కడికి పోవాలో తెలియని పరిస్థితి. అక్కడే వాళ్ళ జీవితాలున్నాయి. పిల్లల స్కూళ్ళున్నాయి. ధర్నాలు, నిరసనలు, ప్రార్థనా కార్యక్రమాలు జరిగాయి. ముసలివారిని, పిల్లలను వెంటేసుకుని ఎక్కడికి పోగలరు? పైగా డిసెంబరు మాసంలోని ఉత్తరాది చలిలో ఎక్కడ తలదాచుకుంటారు. ఏళ్ళ తరబడి చెమటధారబోసి కట్టుకున్న ఇళ్ళు, జీవనోపాధులు వదిలేసి ఎక్కడికి పొమ్మంటున్నారు? మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం డ్రోన్ కెమెరాలతో, అర్ధసైనిక బలగాలతో కదిలివచ్చింది. బలవంతంగా ఇళ్ళు కూలగొట్టే కార్యక్రమానికి పూనుకుంది.

గమనించవలసిన విషయమేమిటంటే, హల్ద్వానీలోని బంభుల్ పురలో నివసిస్తుంది అత్యధికంగా ముస్లిములు. కేవలం ముస్లిములను లక్ష్యంగా చేసుకుని ముస్లిములను వేధించడానికి చేపట్టిన కార్యక్రమం అని స్థానికులే కాదు చాలా మంది విమర్శించడం కూడా ప్రారంభమైంది. రైల్వే అధికారులు ఆ భూమి నుంచి స్థానికులను ఖాళీ చేయించాలనుకుంటే, స్థానిక పాలనా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు ప్రజలకు మద్దతివ్వకుండా రైల్వే అధికారులకు మద్దతిస్తున్నాయన్న ప్రశ్న కూడా తలెత్తింది. హల్ద్వానీలో కథగోదం నుంచి లాల్‌కువాం వరకు 20 కి.మీ.ల పొడవునా రైల్వే ట్రాకు పక్కన అనేక బస్తీలున్నాయి. మరే బస్తీ విషయంలోను ఇలాంటి కూల్చివేత నిర్ణయాలు రాలేదు. బుల్‌డోజర్లు రాలేదు. కాని కేవలం బంబుల్‌పుర విషయంలో మాత్రమే కూల్చివేతల నిర్ణయాలు తీసుకున్నారు. పైగా అక్కడ ప్రభుత్వం నిర్మించిన పాఠశాల భవనాలున్నాయి. ఆరోగ్య కేంద్రాలున్నాయి. బ్యాంకులున్నాయి. వాటర్ ట్యాంకులున్నాయి. వాటిని కూడా కూల్చేయడానికి ప్రభుత్వం ఎందుకు ఇంత ఉత్సాహం చూపిస్తోంది అనే ప్రశ్నలకు ప్రభుత్వం తరఫున జవాబులు లేవు.

ఈ కూల్చివేతల వెనుక మతతత్వ రాజకీయాలున్నాయని, ఓట్ల కోసం హిందూ ముస్లిం విభజన రాజకీయాలే ఈ కూల్చివేతల వెనుక పని చేస్తున్నాయని పలువురు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో అత్యధిక జనాభా ముస్లిములు. కొందరు హిందువులు కూడా నివసిస్తున్నారు. ఇక్కడ హిందూ ముస్లిముల మధ్య ఎన్నడూ ఎలాంటి కలహాలు లేవు. దాదాపు శతాబ్ద కాలంగా కలిసిమెలిసి ఉంటున్నారు. దాదాపు 100 హిందూ కుటుంబాలున్నాయి. ఇక్కడ శివగోపాల్ మందిరం ఆవరణలో 1980 నుంచి సరస్వతి శిశుమందిర్ కూడా నడుస్తోంది. అక్కడ చదువుకుంటున్న పిల్లల్లో చాలా మంది ముస్లిములు కూడా ఉన్నారు.

బంభుల్‌పురాలో చాలా కట్టడాలు దాదాపు 80 సంవత్సరాల చరిత్ర ఉన్న కట్టడాలు. ఇక్కడ మాంసం మార్కెట్టు 1919 నుంచి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి ప్రజలు దిగువ తరగతికి చెందిన పేదవారు. చాలా మంది వృత్తిపనులు చేసుకునే వడ్రంగులు, మెకానిక్కులు. బంభుల్‌పుర కొత్తగా వెలిసిన బస్తీ కాదు. హల్ద్వానీ చరిత్ర ఎంత పాతదో అంతకన్నా పాతది అక్కడి బంభూల్ పుర చరిత్ర. ఇక్కడి ముస్లిములు బయటి నుంచి వచ్చిన వారు కాదు. కిరణ్ త్రిపాఠి తన పుస్తకం “హల్ద్వానీ: మండీసే మహానగర్ కీ ఓర్”లో ఈ ప్రాంతం గురించి రాశారు. 1924లోనే ఇక్కడ జిల్లా పరిషద్ స్కూలు వచ్చిందన్నారు. 1901లో హల్ద్వానీ జనాభా 6,624. ఇందులో 3327 మంది హిందువులు, 3198 మంది ముస్లిములని నైనితాల్ గెజిట్‌లో రాశారు. ఆ తర్వాత హల్ద్వానీలో హిందూ జనాభా క్రమంగా పెరిగింది. ముస్లిములు కేవలం బంభుల్‌పుర వంటి ప్రాంతాలకు పరిమితమయ్యారు. బంభుల్‌పురలో చాలా ఇళ్ళు స్వాతంత్ర్యానికి ముందు కట్టినవి. ఫిదా హుస్సేన్ ఇల్లు 1942లో, అబ్దుల్ మజీద్ ఇల్లు 1936లో కట్టిన ఇళ్ళు.

హల్ద్వానీలో 70 శాతం భూమి ప్రభుత్వ భూమి అని, చాలా మంది తరతరాలుగా అక్కడ ఉంటున్నందువల్ల ఆ భూమి వారి

స్వంతమైందని తెలుస్తోంది. బంభుల్‌పుర విషయంలో కూడా ఇలాగే జరిగింది. ఇవి పట్టాభూములు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ల్యాండ్ డీడ్లు చాలా మంది వద్ద ఉన్నాయి. కొందరు 1950ల్లో కేంద్ర పునరావాస మంత్రిత్వ శాఖ ద్వారా వేలం వేసిన ఇండ్లు కొనుక్కున్నారు. ఇక్కడ కొందరికి ముగల్ కాలంలో కేటాయించిన పత్రాలున్నాయి. చివరి ముగల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ చిత్రంతో ఉన్న పత్రాలు కూడా ఉన్నాయి. బ్రిటీషు ప్రభుత్వ కాలంలో జారీ చేసిన పత్రాలున్నాయి. తమ వద్ద సరయిన పత్రాలున్నాయని, ఈ భూములపై తమకు హక్కులున్నాయని స్థానికులు వాదిస్తున్నారు. వారి పేర్లు మునిసిపల్ రికార్డుల్లో ఉన్నాయి. అన్ని రకాల పన్నులు, శిస్తులు వారు కడుతున్నారు. వారికి గ్యాస్, వాటర్ కనెక్షన్లు కూడా పాలనా యంత్రాంగం ఇచ్చింది. వారి ఇంటి అడ్రసుపై ఆధార్ కార్డులున్నాయి. హల్ద్వానీలో భూదురాక్రమణల విషయానికి వస్తే ఈ పట్టణం ఎలాంటి ప్రణాళికా లేకుండా విస్తరించింది. ఇటీవల అంకితా భండారీ కేసులో అడవి భూమిని ఎలా హొటళ్ళు, రిసార్టుల కోసం ఆక్రమిస్తున్నారో తెలుస్తుంది. అలాంటప్పుడు కేవలం పేద మైనారిటీలను మాత్రమే భూదురాక్రమణదారులుగా ఎందుకు వేధిస్తున్నారన్నది ప్రశ్న.

ఉత్తరాఖండ్‌లో దాదాపు 582 మురికివాడలున్నాయి. ఇందులో 22 హల్ద్వానీలోనే ఉన్నాయి. 2016లో కాంగ్రెసు ప్రభుత్వం వీటిని రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ ప్రారంభించింది. కాని 2022లో ఈ బస్తీల్లో బంభుల్‌పురలోని మురికివాడలను రెగ్యులరైజ్ జాబితా నుంచి తొలగించారు. 2018లో డెహ్రాడూన్‌లో కొన్ని బస్తీలను ఖాళీ చేయించాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. కాని బీజేపీ ప్రభుత్వం అప్పుడు మౌనంగా ఊరుకుంది. 2022లో అందరికీ పక్కా ఇళ్ళు కట్టిస్తామని మోడీ చెప్పారు. కాని ఇప్పుడు బంభుల్‌పురాలో ఇళ్ళను కూలగొట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇంతకు ముందు కూడా కోర్టులు ఖాళీ చేయించాలని ఉత్తర్వులిచ్చినప్పుడు కాంగ్రెసు ప్రభుత్వం ఆ ఉత్తర్వులను కోర్టుల్లో సవాలు చేసింది. కాని ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం పోలీసుల సహాయంతో ఖాళీ చేయించడానికి ఉత్సాహం చూపిస్తోంది. ఎందువల్లనంటే ఈ ప్రాంతం నుంచి ప్రజలను ఖాళీ చేయించడమంటే ఎక్కువగా ముస్లిములను ఖాళీ చేయించడం. దీనివల్ల బీజేపీకి వ్యతిరేకంగా పోలయ్యే పాతిక వేల ఓట్లను తప్పించే అవకాశం లభిస్తుంది. రైల్వే విభాగం భుజంపై తుపాకి పెట్టి బీజేపీ తన రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీస్తోంది. బంభుల్‌పుర భూ వివాదం వెనుక మతతత్వ రాజకీయాలున్నాయని చాలా మంది విశ్లేషిస్తున్నారు.

ఉత్తరాఖండ్ రాష్ట్రం 2000లో ఏర్పాటయ్యింది. హల్ద్వానీ ఇక్కడ ముఖ్యమైన శాసనసభ నియోజకవర్గం. కాంగ్రెసు ఇక్కడ బలంగా ఉంది. 2022లో కూడా ఇక్కడ కాంగ్రెసు గెలిచింది. సుమిత్ హృదయేష్ గెలుపొందారు. జిల్లాలో బీజేపీ ఓడిపోయింది ఇక్కడ మాత్రమే. ఎన్నికల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కూల్చివేతలు చేపట్టారని పలువురు విశ్లేషిస్తున్నారు. మరోవైపు మతతత్వ శక్తులు బంభుల్‌పుర సాకుతో ల్యాండ్ జిహాద్ ప్రచారం చేస్తూ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయి. దేవభూమి ఉత్తరాఖండ్‌లో భూములను ముస్లిములు ఆక్రమించేస్తున్నారనే ప్రచారం సోషల్ మీడియా వేదికగా హోరెత్తుతోంది. ఉత్తరాఖండ్ దేవభూమి కాబట్టి ఇక్కడ కేవలం హిందువులు మాత్రమే ఉండేలా చేయాలని, ముస్లిములను బయటకు గెంటేయాలని కూడా గతంలో పిలుపిచ్చిన వారున్నారు. ఉత్తరాఖండ్‌లో ల్యాండ్ జిహాద్ అనే ప్రచారం చాలా జోరుగా జరుగుతోంది.

మతతత్వ రాజకీయాలతో సతమతమవుతున్న మైనారిటీలకు ఇప్పుడు సుప్రీంకోర్టు ఉత్తర్వు కాస్త ఊరట ఇచ్చింది. కాని సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. దేశంలో మతతత్వ రాజకీయాలు ఎలాంటి పుంతలు తొక్కుతున్నాయో ఈ సంఘటనలు చాటి చెబుతున్నాయి. తరతరాలుగా నివసిస్తున్న వారిని వారి ఇండ్ల నుంచి గెంటేయడం దిగజారుతున్న నైతికతకు మరో నిదర్శనం. ✤


గీటురాయి వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.




ఉమైర్

**ఆంధ్రప్రదేశ్** ఇప్పుడు మాదకద్రవ్యాలకు మారుపేరుగా మారి పోతోందా? మత్తులో యువత చిత్తవుతుందా? మత్తుపదార్థాల మహమ్మారి ఆంధ్రప్రదేశ్‌పై పంజా విసిరిందా? డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ నివేదిక చూస్తే అలాగే అనిపిస్తోంది. 2016లో వచ్చిన ఉడ్తా పంజాబ్ సినిమాపై అప్పట్లో చాలా దుమారమే రేగింది. పంజాబులో యువత మాదకద్రవ్యాలకు ఎలా బానిసలవుతున్నారనే అంశంపై రూపొందించిన సినిమా ఇది. పంజాబు అంటే గోధుమ పంటలు, పరాటాలు, లస్సీలు మనకు గుర్తుకు వస్తాయి, కాని చాలా కాలంగా పంజాబ్ మాదక ద్రవ్యాలకు మారుపేరుగా మారిందనేదే ఈ చిత్రం కథాంశం. డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ నివేదిక తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే పరిస్థితి తలెత్తిందా? అనే అనుమానాలు బలపడు తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా పట్టుబడిన మత్తుపదార్థాల్లో ఆంధ్రప్రదేశ్ దే అగ్రస్థానం అంటోంది డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ నివేదిక. స్మగ్లింగ్ 2021-22 నివేదిక ప్రకారం గత ఆర్థిక సంవత్సరం 18 వేల కిలోల మత్తుపదార్థాలు పట్టుబడ్డాయి. మొత్తం దేశంలో 28 వేల కిలోల డ్రగ్స్ పట్టు బడ్డాయి. ఈ డ్రగ్స్ విలువ వేల కోట్ల రూపాయల్లో ఉంటుందని తెలుస్తోంది. ఢిల్లీలో డిఆర్ఐ 65వ వ్యవస్థాపక దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ ఈ నివేదికను విడుదల చేశారు. ఈ నివేదిక విడుదల చేసిన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ భారతదేశం కొకైన్‌కు కేంద్రంగా మారుతుందా? అని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాల నుంచి డ్రగ్స్ దేశంలోని అక్రమంగా వచ్చిపడుతున్నాయని ఆవేదన చెందారు. ఈ నివేదిక ప్రకారం కస్టమ్స్ విభాగం పట్టుకున్న మాదకద్రవ్యాలు 17,394 కోట్ల విలువ చేస్తాయి. డిఆర్ఐ విభాగం 20,064 కోట్ల విలువ చేసే మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకుంది. దేశంలో అత్య ధికంగా మాదకద్రవ్యాలు స్వాధీనమైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కాగా తర్వాతి స్థానంలో త్రిపుర ఉంది. త్రిపురలో 10104 కిలో గ్రాముల మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. అస్సాం నుంచి 3633.08 కిలో గ్రాముల, తెలంగాణా నుంచి 1012.04 కిలోగ్రాములు స్వాధీనమయ్యాయి.

మాదకద్రవ్యాల కేసుల్లో అత్యధికంగా అస్సాం నుంచి 500 మందిని అరెస్టు చేశారు, త్రిపుర నుంచి 27 మందిని అరెస్టు చేశారు. తెలంగాణా నుంచి అయిదుగురిని అరెస్టు చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లో 90 మందిని అరెస్టు చేశారు. 2021-22లో అత్యధికంగా మధ్యప్రదేశ్ నుంచి 5,846 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 1,057 కేజీలను స్వాధీనం చేసుకున్నట్టు స్మగ్లింగ్ ఇన్ ఇండియా 2021-22 నివేదిక తెలిపింది. ఈ గణాంకాల ప్రకారం గంజాయి

స్మగ్లింగ్‌లో ఏపీ ఎనిమిదవ స్థానంలో ఉంది. ఈ ఏడాది జులైలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో విడుదల చేసిన గణాంకాల ప్రకారం కోవిడ్ కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి స్మగ్లింగ్ విపరీతంగా పెరిగింది. 2019లో ఎన్‌సీబీ ఆంధ్రప్రదేశ్ నుంచి 1,764.20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోగా, 2021లో 7,490.30 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుంది. అంటే, రెండేళ్లల్లో నాలుగు రెట్లు పైనే పెరిగింది. ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో 10 వేల ఎకరాలకు పైనే గంజాయి సాగవుతోందని కిందటి ఏడాది బీబీసీ నివేదిక. అనధికారికంగా గంజాయి సాగు 15 వేల ఎకరాలకు పైనే ఉండవచ్చని అంచనా. చిత్తూరు పోలీసులు మదనపల్లి మండలం మాలేపాడులో పంటపొలాల మధ్య పండిస్తున్న మాదకద్రవ్యాల సాగును కనిపెట్టి పట్టుకున్న వార్త కూడా కొంత కాలం క్రితం వచ్చింది.

కోవిడ్ మహమ్మారి తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయ విమాన ప్రయాణాలపై ఆంక్షలు తగ్గాయి. భారతదేశానికి వచ్చే ప్రయాణీకుల సంఖ్య పెరిగింది. ఫలితంగా మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కూడా పెరిగింది. 2021-22 చివరి రెండు నెలలలో డీఆర్ఐ పలు హెరాయిన్ స్మగ్లింగ్ కేసులను పట్టుకుందని ఈ నివేదికలో తెలిపారు. 2021-22లో కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో 16 కేజీలు, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 3.2 కేజీలు, అహ్మదాబాద్‌లో మూడు సార్లు 4.4 కేజీలు, 5.9 కేజీలు, 8.4 కేజీల హెరాయిన్‌ను, ఢిల్లీ, చెన్నైలలో కూడా పలుమార్లు హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు డీఆర్ఐ వెల్లడించింది. అలాగే, 2020-21తో పోలిస్తే 2021-22కు కొకైన్ స్మగ్లింగ్ విపరీతంగా పెరిగిందని, 2021-22లో డీఆర్ఐ 310 కేజీల కొకైన్ స్వాధీనం చేసుకుందని నివేదిక తెలిపింది. మరోవైపు, అరేబియా సముద్ర ప్రాంతాలలో కార్గో షిప్పుల ద్వారా దేశంలోకి హెరాయిన్ అక్రమ రవాణా 2021-22లో కూడా కొనసాగిందని డీఆర్ఐ పేర్కొంది. ముఖ్యంగా అఫ్ఘానిస్తాన్ నుంచి ఇరాన్, యూఏఈ ద్వారా దేశంలోకి అక్రమంగా రవాణా చేస్తున్న హెరాయిన్‌ను పెద్ద మొత్తాల్లో స్వాధీనం చేసుకున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేసు బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్‌కు సంబంధించిన కేసు. ఈ కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చివరకు ఈ కేసులో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఆర్యన్ ఖాన్‌కు క్లీన్ చిట్ ఇచ్చింది. ఆర్యన్ డ్రగ్స్ తీసుకోలేదని, అతని దగ్గర మాదక ద్రవ్యాలు దొరకలేదని అన్నారు. అలాంటప్పుడు అతన్ని నెల రోజుల పాటు కస్టడీలో ఎందుకు ఉంచారన్న ప్రశ్నలు కూడా వచ్చాయి. ఇలాగే ఇంకా అనేక మంది సిని ప్రముఖుల పేర్లు కూడా డ్రగ్స్ కేసుల్లో వచ్చాయి.

సుశాంత్ రాజ్‌పుత్ మృతి కేసులో డ్రగ్స్ కోణం వెలుగు చూసింది. సినీ నటి రియా చక్రవర్తిని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అరెస్టు చేసింది. ఈ కేసు కూడా సంచలనాత్మకంగా సాగింది. అంతకు ముందు తెలంగాణాలో డ్రగ్స్ కేసు విచారణ సందర్భంగా పోలీసులు చాలా మంది సినీ ప్రముఖులను విచారించిన వార్తలు వచ్చాయి. టాలీవుడ్ డ్రగ్స్ కేసులో చివరకు 16 మంది సిని ప్రముఖులకు ఎక్సయిజ్ శాఖ క్లీన్ చిట్ ఇచ్చింది. ఫోరెన్సిక్ నివేదికలో వారు డ్రగ్స్ ఉపయోగించినట్లు బయటపడలేదు.

ఒకవైపు ఇలాంటి సంచలనాత్మకమైన కేసులు ముందుకు వస్తుంటే, మరోవైపు చాలా భారీస్థాయిలో పట్టుబడిన మాదక ద్రవ్యాలకు సంబంధించిన కేసులు ఈ సంచలనాల హడావిడిలో కొట్టుకుపోతున్నాయి. గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో తొమ్మిది వేల కోట్ల విలువైన మూడు వేల కిలోల హెరా యిన్ పట్టుబడింది. ముంద్రా పోర్టు ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆదానీ గ్రూప్ చెందినది. అక్కడి పోర్ట్ నుండి ఆంధ్రప్రదేశ్‌కు రావలసిన మూడు వేల కిలోల హెరాయిన్ పట్టుబడింది. దీంతో గుజరాత్‌కు ఆంధ్రప్రదేశ్‌కు మధ్య డ్రగ్స్ గుట్టు ఏదో ఉందని అనుమానాలు వ్యక్తమయ్యాయి. దొరికితేనే దొంగ. దొరకపోతే దొరే. ముంద్ర పోర్టులో డీఆర్ జీ కొత్త అధికారి వచ్చారు కాబట్టి తనిఖీల్లో 3 వేల కేజీల హెరాయిన్ దొరికింది. పాత అధికారులు ఇప్పటి వరకూ చెక్ చేయ కుండా ఎన్నింటిని


**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్‌ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

వదిలి వేశారో తెలియని పరిస్థితి అని సందేహాలు వ్యక్తం చేశారు కొందరు. ఎన్ని వేల కిలోలు అక్రమ రవాణా జరిగిందో. ఇది బయటకు వచ్చింది కాబట్టి సంచలన వార్త అయ్యింది. పట్టు బడిన హెరా యిన్ విజయవాడ అడ్రస్ పేరుతో ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఆరోపణలు వచ్చాయి.

దేశంలో అనేక ప్రాంతాల్లో నిత్యం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తనిఖీలు చేస్తుంటుంది. మాదక ద్రవ్యాలను పట్టుకుంటుంది. అలా పట్టుకున్న డ్రగ్స్ మొత్తం ఇటీవల కాలంలో ఏకంగా 30 వేల కేజీలకు చేరాయట. వాటిని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు ధ్వంసం చేశారు. సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలోనే ఈ ధ్వంసం ప్రక్రియ నిర్వహించారు.

సెలబ్రిటీలు, సినీ ప్రముఖులకు సంబంధించి డ్రగ్స్ వార్తలు వచ్చినప్పుడు పెద్ద సంచలనమే అవుతోంది. టీవీ చానళ్ళలో చర్చలు జరుగుతున్నాయి. రోజుల తరబడి ఆ వార్త హెడ్ లైన్లలో నలుగుతుంది. కాని, విద్యార్థుల్లో, యువతరంలో పెరుగుతున్న డ్రగ్స్ వాడకం దేశప్రగతికి గొడ్డలిపెట్టు. నిత్యం డ్రగ్స్ పట్టు బడుతున్న వార్తలు ఆందోళన కలిగించే వార్తలు. ఈ మహమ్మారిని అడ్డుకోడానికి ఏం చేయాలన్నదే ఇప్పుడు అందరినీ ఆవేదనకు గురి చేస్తున్న ప్రశ్న. 2016లో ప్రపంచవ్యాప్తంగా పట్టుబడిన గంజాయిలో ఆరు శాతం అంటే దాదాపు 300 టన్నులు ఒక్క ఇండియాలోనే పట్టుబడింది. 2017లో ఇది 20 శాతం పెరిగింది. అంటే 353 టన్నులు అయ్యింది. హెరాయిన్ సరఫరాకు హైదరాబాద్ కీలకంగా మారినట్లు వార్తలు వచ్చాయి. హైదరాబాదు విమానాశ్రయంలో పట్టుబడుతున్న హెరాయిన్ దీనికి సాక్ష్యం. కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొంతకాలం క్రితం దేశ వ్యాప్తంగా 186 జిల్లాల్లో నాలుగు లక్షల మందికి పైగా మత్తుమందుల వినియోగదారులపై సర్వే చేశారు. వీళ్ళందరు గంజాయి, నల్లమందు, కొకైన్, ఏటిఎస్ వంటివి వాడుతున్నారు. దేశ జనాభాలో 3.1 కోట్ల మంది నల్లమందుకు బానిసలని తెలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం రాష్ట్రాల్లో నల్లమందు వ్యసనం అత్యధికంగా ఉంది. దేశంలో గంజాయికి బానిసలైన వారి సంఖ్య 2.2 కోట్లు ఉంటుందని అంచనా. ఉత్తరప్రదేశ్, సిక్కిం, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీల్లో గంజాయి వినియోగం చాలా ఎక్కువ. హెరాయిన్ వినియోగం కూడా భారతదేశంలో చాలా ఎక్కువని కొందరి అంచనా. 2030 నాటికి మాదక ద్రవ్య బానిసల సంఖ్య 11శాతం పెరుగుతుందని ఐరాస అంచనా.

దేశంలో మాదకద్రవ్యాల ఉత్పత్తి పెరుగుతోందని వార్తలు వస్తున్నాయి. పాకిస్తాన్, మయన్మార్, టర్కీ, లావోస్, తదితర దేశాల్లో గసగసాల సాగు భారీ స్థాయిలో సాగుతోంది. దీని ద్వారా తయారయ్యే నల్లమందు, దాని నుంచి ఏటా ఉత్పత్తి చేసే మాదకద్రవ్యాలు ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 27.5 కోట్ల మంది నిషేధిత మాదకద్రవ్యాలకు బానిసలుగా ఉన్నారని అంతర్జాతీయ ఆరోగ్యసంస్థ విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో గంజాయి వాడేవారి సంఖ్య అత్యధికంగా 19.2 కోట్ల వరకూ ఉంటుందని, ఇంజెక్షన్ల ద్వారా డ్రగ్స్ తీసుకునేవారి సంఖ్య 1.10 కోట్ల వరకూ ఉంటుందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. “అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో అక్రమ మాదకద్రవ్యాల దుర్వినియోగం అంటువ్యాధి కంటే ఎక్కువగా ప్రబలింది” అని న్యూయార్క్‌లోని హంటర్ కాలేజీలో మనస్తత్వ శాస్త్ర డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జెఫ్రీ టి. బాల్సర్ అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా 2020లో 20కోట్ల మంది మాదకద్రవ్యాలను వాడుతున్నట్లు ఐక్యరాజ్యసమితి కార్యాలయం యుఎన్ఓడిసి లెక్కకట్టింది. వీరిలో 3.60 కోట్ల మంది డ్రగ్ సంబంధిత వ్యాధుల బారిన పడ్డారు. కరోనా తర్వాత గంజాయి వినియోగం ప్రపంచంలో పెరిగింది. మాదకద్రవ్యాల దురలవాటు ఇప్పుడు అంతర్జాతీయ సమస్య. అక్రమ రవాణా చేసే స్మగ్లర్లు తీవ్రవాద గుంపులు సప్లయ్ చైన్ల ద్వారా ఈ వ్యాపారాన్ని యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దురలవాటు, అక్రమరవాణా వ్యతిరేక దినం 2022 జూన్ 26న జరిగింది. ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం 1989 నుంచి ప్రతి ఏటా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాదకద్రవ్యాలను అరికట్ట డానికి వివిధ దేశాలు వివిధ పద్ధతుల్లో ప్రయత్నిస్తున్నాయి. మలేషియా, చైనా, వియత్నాం, ఇరాన్, థాయ్‌లాండ్, దుబాయ్, సౌదీ అరేబియా, సింగపూర్, కాంబోడియా, ఇండోనేషియా, లావోస్, ఉత్తరకొరియా, ఫిలిప్పైన్స్, టర్కీ, కోస్టారికా, కొలంబియా తదితర దేశాలు మాదకద్రవ్యాల కేసులకు మరణశిక్షలు విధిస్తున్నాయి. అమెరికా వంటి దేశాలు మత్తుమందులపై యుద్ధం కోసం వేల కోట్లు ఖర్చు పెడుతున్నాయి. కెనడా వంటి దేశాలు వ్యసనపరుల పట్ల సానుకూల వైఖరి చూపిస్తున్నాయి. వారి కోసం ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైద్యుల సహాయంతో అలవాటు మాన్పించే ప్రయత్నం చేస్తున్నారు. పోర్చుగల్‌లో పునరావాస కేంద్రాలకు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తారు.

డ్రగ్స్ దందా అనగానే ఇప్పుడు అందరి కళ్ల ముందూ సినిమా సెలబ్రిటీలు కదులుతున్నారు. కాని ఈ సంచలనాత్మక కేసుల వల్ల మిగిలిన కేసులపై ఫోకస్ తగ్గిపోయింది. హైద్రాబాద్ డ్రగ్స్

సప్లైకి, అంతర్జాతీయ మాఫియాకి సంబంధాలు వున్నాయని గత కొన్ని సంవత్సరాలుగా వస్తున్న వార్తలు ఆందోళనకరమైనవి. తెలంగాణ ప్రభుత్వం డార్క్ నెట్ వెబ్ సర్వర్లను నిషేధించాలని అమెరికాను కోరిందనే వార్త గతంలో వచ్చింది. హైద్రాబాద్‌లో చేతులు మారుతున్న డ్రగ్స్ కి కారణం ఈ డార్క్ నెట్ సర్వర్లే! ఎక్కడో అమెరికా, లండన్లలో ఈ వెబ్ సైట్లు తమ సర్వర్లు ఏర్పాటు చేసుకుంటాయి. అక్కడ నుంచీ ప్రపంచ వ్యాప్తంగా దందా చేస్తుంటాయి. డ్రగ్స్ కు సంబంధించి బుకింగ్స్ తీసుకోవటం, డబ్బులు తీసుకోవటం, డ్రగ్స్ ఫలానా అడ్రస్ కు పంపటం అంతా ఆన్‌లైన్ జరుగుతుందని కూడా తెలుస్తోంది. వివిధ పేర్లతో నడిచే డార్క్ నెట్ వెబ్ సైట్ల గురించి సాధారణ ప్రజలకు తెలియదు. కాని వ్యసనపరులు డ్రగ్స్ ఇంటికే తెప్పించేసుకుంటున్నారు.

సమాజంలో ముఖ్యంగా యువతలో మాదకద్రవ్యాల అలవాటు పెరగడం పరిస్థితి తీవ్రతకు దర్పణం పడుతోందని సుప్రీం కోర్టు కూడా వ్యాఖ్యానించింది. సమాజంలో నెలకొన్న ఈ రుగ్మతను పరిష్కరించడానికి సుమోటోగా తీసుకున్న కేసు విచారణలో కేంద్రం కూడా భాగస్వామ్యం కావాలని పేర్కొంది. ఈ కేసులో అమికస్ క్యూరీగా న్యాయవాది షోయబ్ ఆలమ్‌ను నియమించింది. దేశంలో ముఖ్యంగా స్కూలు కెళ్లే పిల్లల్లో, యువతలో మాదకద్రవ్యాల ముప్పు ఆందోళనకర రీతిలో పెరుగుతోందంటూ ఒక పౌరుడు సుప్రీం కోర్టుకు రాసిన లేఖను సుమోటోగా కోర్టు స్వీకరించింది. గతంలో ఇదే సమస్యపై పలు హైకోర్టులు కూడా దృష్టి సారించాయి. హేయమైన నేరాల వెనుక గల ప్రధాన కారణం మాదకద్రవ్యాలుగా వుంటున్నాయని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రతి సంవత్సరం ఏకంగా ఏడు మిలియన్లకు పైగా ప్రజలు ఈ డ్రగ్స్ వల్ల మరణిస్తున్నారని ఒక అధ్యయనం తేల్చింది. డ్రగ్స్ నిరంతరం వాడటం వల్ల అనేక ప్రమాదాలు సంభవిస్తాయి. డిప్రెషన్, మతిస్థిమితం కోల్పోవడం, ఆందోళన వంటి మానసిక సమస్యలు వస్తాయి. గుండె సంబంధిత, శ్వాసకోశ వ్యాధులు.. మూత్రపిండాలు దెబ్బతినడం వంటి దీర్ఘకాలిక సమస్యలు వస్తాయి. ఈ వ్యసనం ఒక్కోసారి మరణానికి దారితీస్తుంది. ఎన్ఐడీఏ ప్రకారం... గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధి, కేన్సర్, మానసిక అనారోగ్యం, హెచ్ఐవీ,హెపటైటిస్ ఇతర వ్యాధులు రావచ్చు. డ్రగ్స్ వ్యసనం నివారణకు చికిత్స చేయవచ్చు. కాకపోతే, దీనికి కాస్త సమయం, కృషి కావాలి. ఇది దీర్ఘకాల ప్రక్రియ. దీనికి కుటుంబం సహకారంతోపాటు నిపుణుల సలహాలు కూడా తోడవ్వాలి.

పాలకుల వైఫల్యాలు, యువతను మత్తులో ముంచే సామాజిక వాతావరణం, అరచేతిలో ప్రపంచాన్ని ఇముడ్చుతున్న అంతర్జాలం, తల్లిదండ్రులు తమ పిల్లలతో గడపకపోవడం, విద్యా వ్యవస్థలో లోపాలు, విద్యార్థులపై ఒత్తిడి, క్షీణిస్తున్న సామాజిక విలువల ఫలితంగానే భావితరం దారి తప్పుతున్నది. కేవలం సంఘటనలు జరిగినప్పుడే అధికార యంత్రాంగం మేల్కొంటున్నది. ముందస్తు చర్యలు తీసుకుని సమస్యను కట్టడి చేసే ప్రయత్నాలు కనిపించడం లేదు. యువతకు ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాల వైఖరి కూడా దీనికి కారణం.

అత్యధిక మోతాదులో తీసుకున్నప్పటికీ అత్యల్పస్థాయిలో మత్తునిచ్చినప్పటికీ అలాంటి పదార్థాన్ని ఇస్లాం నిషేధిస్తుంది. మత్తుపదార్థాలను తీసుకోవడమే కాదు, రవాణా చేయడం, క్రయవిక్రయాలు, మత్తుపదార్థాలతో సంబంధించిన ప్రతి కార్యకలాపాన్ని నిషేధిస్తుంది. ఇస్లాం చరిత్రలో మద్యనిషేధం గురించిన దైవాదేశాలు వచ్చినప్పుడు మదీనా వీధుల్లో మద్యం కాలువలు ప్రవహించాయి. ఇండ్లలో ఉన్న మద్యాన్ని తీసుకొచ్చి స్వచ్ఛందంగా బయట పారేశారు. మద్యానికి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలనే నైతిక, ఆధ్యాత్మిక బోధనలు నేటి సమాజానికి ఎంతైనా అవసరం. ✤



కథ

# మనసున మనసై...

- ఖుర్షీద్ బేగం, మార్కాపురం



**మనసున మనసై బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యము అదే స్వర్గము...** అనే పాట ఎక్కడినుంచో దూరంగా వినిపిస్తోంది. తన ఇంట్లో బండి తుడుచుకుంటున్న వహీద్ ఎంత అద్భుతంగా చెప్పాడు కవి అని మనసులోనే కవికి అభినందనలు చెప్పాడు. ఎందుకో మనసంతా భారంగా అయిపోయింది. అర్థం చేసుకునే తోడు దొరికితే జీవితం స్వర్గం, అపార్థం చేసుకునే భాగస్వామి దొరికితే.. అంటూ నిట్టూర్చాడు. వహీద్ ఒక ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగి. జీతం తక్కువ. మంచితనం ఎక్కువ. సహనశీలి, మృదు స్వభావి. పైగా ధార్మికుడు. కట్నకానుకలు తీసుకోకూడదని ఓ పేదింటి అమ్మాయిని ఏరి కోరి చేసుకున్నాడు. ఎంత సంపాదించాము అనేది ముఖ్యం కాదు ఎలా సంపాదించాము అనేది ముఖ్యం అనుకునే వ్యక్తి. వహీద్ తన భార్య సల్మా గురించి ఎంతో ఊహించుకున్నాడు. పేదింటి అమ్మాయి కదా కష్టనష్టాలు తెలును కదా... అన్ని విధాలా అర్థం చేసుకుంటుందని అనుకున్నాడు. పెళ్ళయిన కొత్తలో సల్మా భర్తకు అనుకూలంగానే ఉండేది. కానీ రానురాను సల్మా మారిపోయింది. చాలీచాలని జీతం, అరకొర జీవితానికి సర్దుకుపోలేకపోయింది. భర్తను సాధించడం మొదలు పెట్టింది. వహీద్ భార్యకు ఎన్నో రకాలుగా చెప్పి చూశాడు. కానీ ఏమీ లాభం లేకపోయింది. తనని మార్చే భారం అల్లాహ్ మీద వదిలేశాడు వహీద్.

'ఆఫీసుకు టైం అవుతుంది. సల్మా టిఫిన్ చేశావా? లాలనగా' అడిగాడు వహీద్. కళ్ళతోనే నిప్పులు కురిపించింది సల్మా. నాకేమైనా పది చేతులు ఉన్నాయా? లేక ఇంట్లో పని మనుషులు ఉన్నారా? అన్నీ నేనే చేసుకోవాలిగా? సల్మా నుంచి సమాధానం.

సరే నీకు కుదరకపోతే బయట తింటాను. టెన్షన్ పడకు సముదాయించాడు వహీద్ భార్యను. ఎందుకులెండి బయట తినడం? మనమేమైనా డబ్బున్న వాళ్ళమా? వెటకారాన్ని జోడించింది సల్మా. భార్య మాటల్లో ఉన్న వెక్కిరింపు, సాధింపు బాగా తెలుసు. మౌనంగా ఆఫీసుకు బయలుదేరాడు.

ఏంటో ఈ జీవితం మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కు. తన ఫ్రెండ్స్ అంతా పెద్దపెద్ద హోదా ఉన్న వాళ్ళను, బాగా డబ్బున్నవాళ్ళను చేసుకొని నగలు, కార్లు, బంగ్లాలో మహారాణుల్లా ఎంజాయ్ చేస్తుంటే తన బ్రతుకేమో ఇలా ఉంది అని మనసులోనే అనుకుంది. అయినా నాలో నేను అనుకుని ఏం లాభం? మా అమ్మానాన్నల్ని అనాలి. తన అందానికి ఏ లక్షాధికారో, కోటీశ్వరుడో వచ్చేవాడు. గుణం, ధార్మికత అని కన్నవాళ్ళు ఓ మధ్యతరగతి జీవికి ఇచ్చి చేస్తే పెళ్ళి ఏం చేస్తుంది తను మాత్రం. గొర్రె తోక పట్టుకుని గోదారి ఈదినట్లు ఉంది. తన మీద తనకే జాలేసింది.

సాయంత్రం అలా ఇంటికి దగ్గరలో ఉన్న కూరగాయల మార్కెట్‌కు వెళ్ళింది. వెనుక నుంచి ఎవరో గట్టిగా భుజం మీద తట్టారు. అంతే... ఒక్కసారిగా ఉలిక్కిపడింది సల్మా. మీరు? అని ఎదురుగా ఉన్న అమ్మాయిని గుర్తు పట్టలేదు. బురఖాలో ఉన్నా సల్మాను గుర్తుపట్టిందా అమ్మాయి. సల్మా నీ గొంతు విని నేను గుర్తుపట్టాను. కానీ నన్ను నువ్వు గుర్తుపట్టలేదా? బుంగ మూతి పెట్టుకుంది ఆ అమ్మాయి. ఎక్కడో చూసినట్టు ఎప్పుడో కలిసినట్టు అనిపిస్తుంది కానీ... తన పేరు, ఊరు సరిగ్గా గుర్తు రావడం లేదు సల్మాకు. తడబడుతూ గుర్తు చేసుకునే ప్రయత్నం చేసింది. ఇంకా గుర్తుపట్టలేదా? సల్మా నేను నీ క్లాస్‌మేట్ మాధవిని. మనమిద్దరం ఆరు నుంచి పది దాకా ఒకే హైస్కూల్‌లో చదువుకున్నాము... చెప్పింది ఆ అమ్మాయి. అప్పుడు గుర్తుకు వచ్చింది తను మాధవి అని. తన క్లాస్‌మేట్ అని. మాధవిని చూసి సల్మా అస్సలు పోల్చుకోలేకపోయింది. చాలా మారిపోయింది మాధవి. ఖరీదైన చీరలు ఒంటినిండా నగలు, కారులో తిరగడం అబ్బో రాణిభోగం మాధవిది. దేనికైనా రాసి

పెట్టుండాలి. అసూయతో మనసు చివుక్కుమంది. సరేలే, సల్మా ఎన్ని సంవత్సరాలకు మళ్ళీ కలిశాం. మా వారు ఈ ఊళ్ళోనే పెద్ద బిజినెస్‌మెన్. మా ఇల్లు దగ్గరే ఇక్కడికి. రా వెళ్దాం ఇంటికి అని బలవంతం చేసింది మాధవి. ఎందుకో మాధవిని చూసిన ఆనందం కంటే ఆమె అనుభవిస్తున్న రాణివాసం ఒకింత బాధ పెట్టింది సల్మాకు. మనసులో అసూయ కాల్చేస్తున్నా బయటికి మాత్రం రాని నవ్వు తెచ్చుకొని ఇప్పుడు కాదులే మాధవి.. సాయంత్రం అవుతుంది. మా వారు ఆఫీసు నుండి వస్తారు ఇంట్లో కూడా పని ఉంది. రేపు ఆదివారమేగా ఆయనకు సెలవు, నీ ఫోన్ నంబర్, అడ్రస్ ఇవ్వు.. వస్తాను చెప్పింది అయిష్టంగానే. వెంటనే బ్యాగులో నుంచి తన అడ్రస్, ఫోన్ నంబర్ ఇచ్చింది మాధవి. సరే, రేపు తప్పకుండా రావాలి. నీ కోసం ఎదురు చూస్తుంటాను... చెప్పి తన ఖరీదైన కారులో వెళ్ళిపోయింది. తన హెూదా, డబ్బు, తన లగ్జరీ చూపించడానికి నన్ను రమ్మంటుంది. మాధవి భర్తేమో పెద్ద బిజినెస్‌మ్యాన్. తన భర్త ఒక చిన్న ఉద్యోగి, తనదేమో పెద్ద విల్లా, మరి నాది ఓ చిన్న ఇల్లు. అది కూడా సొంతం కాదు అద్దెది. తనేమో ఖరీదైన కారులో తిరుగుతుంది. మరి తను షేర్ ఆటోలో. ఛీ.. ఏంటో ఈ జీవితం. కోపం, ఉక్రోషం, బాధ, అసూయ అన్నీ పొంగుకొచ్చాయి సల్మాలో.

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చాడు వహీద్. చిరాకుగా ఉన్న భార్యను గమనించాడు. ఏంటో బేగం గారు ఇంకా చిరాకు మూడ్‌లోనే ఉన్నారు... చిన్నగా నవ్వాడు వహీద్.

❖❖❖

మర్నాడు ఆదివారం వహీద్‌కు సెలవు. మనసులో ఎక్కడో సల్మాకు మాధవి వాళ్ళ ఇంటికి వెళ్ళి తన విలాసవంతమైన జీవితం చూడాలని ఆరాటంగానే ఉంది. భర్తను అడిగింది మాధవి వాళ్ళింటికి వెళ్తానని. సరే, అన్నాడు. నేను నా బండి మీద తీసుకెళ్తానులే అన్నాడు. వద్దులెండి ఈ డొక్కు బండి మీద పోతే నా పరువు పోతుంది మాధవి దగ్గర.

నేను ఆటోలో వెళ్తాను లెండి నిష్టూరంగా చెప్పింది సల్మా. మనసు చివుక్కుమంది వహీద్‌కు. కానీ మౌనంగా ఉన్నాడు. ఆటోలోనే వెళ్ళింది. నిజంగా పెద్ద విల్లా. ఎంత పెద్దదో. అలా ఆ ఇంటిని చూస్తూ ఉండిపోయింది సల్మా. మాధవి ఎదురొచ్చి స్వాగతం పలికింది స్నేహితురాలికి. తన బంగ్లా అంతా తిప్పి చూపించింది మాధవి. కాఫీ, కూల్‌డ్రింక్ మర్యాదలు అయ్యాక మీ వారు లేరా? ఇంత పెద్ద ఇంటిలో నువ్వు, మీ వారే ఉంటారా? ప్రశ్నలు కురిపించింది. కాసేపు మౌనం ఇద్దరి మధ్య. మావారు నాతో ఉండరు సల్మా. నేను ఒక్కదాన్నే ఉంటాను ఈ ఇంట్లో. మెల్లగా చెప్పింది మాధవి. అదేంటి అన్నయ్యగారు బిజినెస్ పని మీద వేరే ఊరువెళ్ళారా? క్యాజువల్‌గా అడిగింది. లేదు సల్మా ఆయన వేరే పెళ్ళి చేసుకున్నారు. ఒక్కసారిగా షాక్ అయింది సల్మా. ఏంటీ ఏం మాట్లాడుతున్నావు? అవును సల్మా బయటికి కనిపించే అందమైన, విలాసవంతమైన జీవితం అందరికీ తెలుస్తుంది. కానీ ఈ బంగారు పంజరంగా ఒంటరిగా, అనాథగా బ్రతుకుతున్నాను. నాకు అందం ఉందని నా భర్త ఏరికోరి చేసుకున్నాడు. కానీ పెళ్ళి అయ్యాకే నా అందం ఆయనకు పాతబడిపోయింది. నాకన్నా అందగత్తె కావాల్సి వచ్చింది.

పెళ్ళయి పది సంవత్సరాలు అయినా పిల్లలు పుట్టలేదని నా భర్త ఆ వంకతో వేరే పెళ్ళి చేసుకున్నాడు. నా మీద కొంచెం కూడా ప్రేమ లేదు. కేసులు, గొడవలు కాకూడదని ఇదిగో ఇలా ఈ బంగ్లా, కారు, డబ్బు నా ముఖం మీద కొట్టాడు. అంతే. ఈ బాధ ఎవరికీ చెప్పలేను. కన్నవాళ్ళకు నిజం తెలిస్తే తట్టుకోలేరు. చెప్పలేను వాళ్ళతో. ఒంటరితనం నరకం కంటే ఘోరంగా ఉంది. ఎందుకు ఈ డబ్బు? హెూదా, కార్లు, బంగ్లాలు. భర్త ప్రేమ లేనప్పుడు? ఖరీదైన బంగ్లాలో ప్రాణం ఉన్న శవంగా బ్రతుకుతున్నాను అంతే. నాదీ ఒక బ్రతుకేనా? పగవాడికి కూడా ఇలాంటి జీవితం రాకూడదు. అని సల్మాను పట్టుకొని భోరున ఏడ్చేసింది మాధవి.

అంతే, ఒక్క క్షణం ఏమీ అర్థంకాలేదు సల్మాకు. నిజంగా మాధవి ఎంత అదృష్టవంతురాలు అనుకుంది. అదృష్టం ఆస్తుల్లో ఉంటుందని, ఆనందం నగలు, బంగ్లాల్లో దొరుకుతుందని భ్రమ పడింది. అందగత్తె కాకపోయినా ఒక మోస్తరుగా ఉండే తనని వహీద్ ఏరికోరి చేసుకున్నాడు. పెళ్ళి రోజు నుంచి ఇప్పటిదాకా తనను ఎంతో ప్రేమగా చూసుకున్నాడు. పెళ్ళయి సంవత్సరాలు గడుస్తున్నా తనకూ పిల్లలు పుట్టలేదు. అయినా ఏనాడూ ఆ వంకతో తనని బాధపెట్టలేదు. భారం అంతా అల్లాహ్ పైన వేసి, ఉన్న దాంట్లో తృప్తిగా ఉండేవాడు. ఉన్నదాంట్లోనే సల్మాకు ఏ చిన్న కష్టం కలగకుండా చూసుకునేవాడు. భార్య అంటే ఎంతో గౌరవం, ప్రేమ, సల్మా చిరాకుపడినా, చిర్రుబుర్రులాడినా సర్దుకుపోయేవాడు. నిజంగా అలాంటి ఉత్తముణ్ణి ఎంతగా అపార్థం చేసుకున్నానో అని మనసులోనే బాధపడింది సల్మా.

తన భర్త చెప్పినట్టు ఆనందం డబ్బులో ఉండదు. అన్యోన్యతలో ఉంటుంది. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోవడంలో ఉంటుంది. భార్యాభర్తల అన్యోన్యతగా ఉన్నప్పుడు పూరి గుడిసె అయినా పాలరాతి భవనంగా అనిపిస్తుంది. పచ్చడి మెతుకులయినా పంచభక్ష పరమాన్నాలుగా కనిపిస్తాయి.

ఏడుస్తున్న మాధవిని ఓదార్చి వెంటనే బయలుదేరింది సల్మా. భర్తకు ఫోన్ చేసింది. ఏవండీ... మన బండి తీసుకురండి నన్ను తీసుకెళ్తురు అని.

బండి మీద కూర్చుని తన భర్త భుజం మీద చేయి వేసి వెళ్తుంటే... ఎక్కడి నుంచో మళ్ళీ ఒక పాట. మనసున మనసై.. బ్రతుకున బ్రతుకై తోడొకరుండినా అదే భాగ్యము అదే స్వర్గము... అంతే బండి అలా బయలుదేరింది. సల్మా, వహీద్ దంపతుల కొత్త ప్రయాణం అలా మొదలైంది.




# గాలి విషమైతే

**ప్రస్తుతం** ఢిల్లీతో పాటు హైదరాబాద్‌లోనూ వాయుకాలుష్య తీవ్రత ఎక్కువగా ఉందని సిపిసిబి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే ఢిల్లీలో నివసించే ప్రజలు కాలుష్యం బారితో పలు శ్వాసకోశ ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి రానున్న రోజుల్లో హైదరాబాద్‌లో కూడా తలెత్తే పరిస్థితి ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ సహా పరిసర ప్రాంత ప్రజలు గడపదాటి బయటకు రావాలంటే మాస్కు ధరించక తప్పని పరిస్థితి నెలకొంది. కోరలు చాచిన వాయు కాలుష్యం ఈ దుస్థితిని తీసుకొచ్చింది. చలికాలమొస్తే చాలు ఢిల్లీలో పీల్చే గాలి విషంగా మారుతుంది.

దేశ రాజధాని మాదిరి పరిస్థితులు ఇప్పుడు తెలంగాణా రాజధాని హైదరాబాదులోను తలెత్తుతున్నాయి. హైదరాబాదులోని కొన్ని ప్రాంతాల్లో వాయు కాలుష్యం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించిన తాజా గణాం కాలను పరిశీలిస్తే హైదరాబాదులోని పలు ప్రాంతాలు కాలుష్యం కోరల్లో విలవిలలాడుతూ కనిపిస్తున్నాయి. సనత్‌నగర్‌లో గాలి నాణ్యత 213 పాయింట్లు నమోదైంది. జూపార్కు వద్ద 162, హెచ్సీయు వద్ద 101, రామచంద్రాపురం వద్ద 77, మలక్ పేట వద్ద 55 పాయింట్లు నమోదైంది. ఇతర మెట్రో నగరాలను చూస్తే ముంబయి, చెన్నై, బెంగుళూరు నగరాల్లోను కాలుష్యం పెరిగిపోతోంది. ముంబయి 232 పాయింట్లతోను, చెన్నై 105 పాయింట్లతోను గాలి నాణ్యతను సూచిస్తున్నాయి. అన్నింటికన్నా అధమం ఢిల్లీలో గాలి. ఇక్కడ తరచూ 400 పాయింట్లను దాటి పోవడం జరుగుతోంది. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో వాయు కాలుష్యంపై నివేదికలు వచ్చాయి. రెండేళ్ళ క్రితం కేంద్ర పర్యావరణ శాఖ సహాయమంత్రిగా పనిచేసిన బాబుల్ సుప్రియో రాజ్యసభలో ఒక ప్రశ్నకు జవాబిస్తూ 2014 నుంచి 2018 మధ్య దేశంలోని వివిధ నగరాలలో గాలి నాణ్యతపై జరిపిన అధ్యయనంలో రాష్ట్రంలోని అనంతపురం, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో స్వచ్ఛమైన గాలి నాణ్యత అత్యల్పంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

ఇక తెలంగాణా విషయానికి వస్తే, ఇటీవల వచ్చిన వార్తల ప్రకారం నగరం చుట్టుపక్కల పారిశ్రామిక ప్రాంతాల్లో ఉన్న 25 పరిశ్రమల అత్యంత కాలుష్యం వెదజల్లుతున్నాయని గతంలో చేసిన అధ్యయనంలో పిసిబి అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాల్లో గరిష్ఠ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్150కి పైగా నమోదు అవుతున్నా

యని, మామూలుగా ఏక్యూఐ 100 దాటితే శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కాలుష్యం ఎక్కువగా విడుదల చేసే పరిశ్రమల్లో ఫార్మాతో పాటు పొగాకు, రసాయనాలు, రబ్బర్, ప్లాస్టిక్, మెటల్ ఫ్యాబ్రికేషన్, లెదర్ లాంటి పరిశ్రమలున్నాయని వీటితోనే కాలుష్యం అధికమయ్యిందని పిసిబి అధికారులు తమ అధ్యయనంలో తేల్చారు. కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలించాలని గతంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో టిఎస్ఐఐసి దీనికి సంబంధించిన ఏర్పాట్లను సైతం చేస్తోంది. ముందుగా ఆయిల్ పరిశ్రమలను తరలించాలని నిర్ణయించిన ప్రభుత్వం అందులో భాగంగా ఆయా కంపెనీ యాజమాన్యాలకు సైతం నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న పలు కంపెనీల యజమానులు కోర్టుకు వెళ్లడంతో ప్రస్తుతం పరిశ్రమల తరలింపు నత్తనడకన సాగుతోంది. ఆయిల్ పరిశ్రమల కోసం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలోని బూచనెల్లికి 200 ఎకరాల స్థలాన్ని కేటాయించడంతో పాటు ఫార్మా కంపెనీలకు ఫార్మా సిటీలో స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల మేరకు రెండు సంవత్సరాలుగా 300ల నుంచి 400ల కంపెనీలు మాత్రం తమ కంపెనీలను ఔటర్ అవతలకు తరలించినట్టుగా పిసిబి అధికారుల గణాంకాలు పేర్కొంటున్నాయి.

హైదరాబాదులోని జీడిమెట్ల, బాలానగర్ పటాన్‌చెరు, యాదాద్రి జిల్లా చౌటుప్పల్ ప్రాంత వాసులు ఇక్కడ ఉన్న పరిశ్రమల నుంచి వచ్చే వాయు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని నీటి వనరులు సైతం రంగు మారిపోవడంతో తాగడానికి నీరు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్ల, బాలానగర్, ఎద్దుమైలారం, బాచుపల్లి, చౌటుప్పల్ పారిశ్రామిక ప్రాంతాల్లో రెడ్, ఆరెంజ్ కేటగిరీకి సంబంధించి సుమారుగా 2,000ల వరకు పరిశ్రమలు ఉన్నాయని పిసిబి తన అధ్యయనంలో వెల్లడించింది. ఈ ప్రాంతాల్లో గరిష్ఠ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 150కి పైగానే నమోదు అవుతున్నాయి. మాములుగా ఏక్యూఐ 100 దాటితే శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయని ఆస్తమాతో ఊపిరితిత్తుల వ్యాధులతో చాలామంది ఆస్పత్రుల్లో చేరుతున్నట్టుగా వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

ఢిల్లీ నగరంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఢిల్లీ నగరంలోని వాహన ఉద్గారాలకు తోడు పొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానాలో రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల ఏర్పడే పొగ శీతాకాలంలో సహజసిద్ధంగా ఏర్పడే పొగమంచులో కలిసిపోయి ఊపిరి పీల్చుకోలేని ఉక్కిరిబిక్కిరి పరిస్థితిని సృష్టిస్తున్నాయి. భవన నిర్మాణ పనుల కారణంగా ఏర్పడే దుమ్ము, ధూళి అన్నీ కలగలిపి గాలి నాణ్యతను దారుణంగా దెబ్బ తీస్తున్నాయి. ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400 దాటిపోతోంది. ఢిల్లీ నగరం ప్రపంచ కాలుష్య రాజధానిగా మారిందంటే అతిశయోక్తి కాదు. ఢిల్లీలో గాలి నాణ్యత మెరుగుపడే వరకు పాఠశాలలను మూసివేయాల్సిందిగా జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరింది. పిల్లల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని దేశ రాజధానిలో వాయు నాణ్యత మెరుగయ్యే వరకు పాఠశాలలను మూసివేసే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. ఢిల్లీలో వాయు కాలుష్యానికి తగ్గించేందుకు అత్యవసర ప్లాన్‌ను సిద్ధం చేయాలని కోరింది. గత ఏడాది సైతం వాయుకాలుష్యం తీవ్రత నేపథ్యంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

వాయు కాలుష్యం పర్యావరణంపై తీవ్రమైన దుష్ప్రభావం చూపుతుందని ఎన్నో పరిశోధనలు తేల్చాయి. వాయు కాలుష్యం దాదాపు 40 శాతం మంది భారతీయుల ఆయుర్దాయాన్ని తొమ్మిదేళ్లపాటు తగ్గిస్తుందని ఒక అధ్యయనం గుర్తించింది. న్యూఢిల్లీ సహా మధ్య, తూర్పు, ఉత్తర భారతదేశంలో నివసిస్తున్న 48 కోట్లకు పైగా ప్రజలు తీవ్రమైన కాలుష్యం ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారని నివేదిక తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ చికాగోలోని ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ ఈ అధ్యయనం చేపట్టింది. వాయుకాలుష్యం భారతదేశం అంతటా విస్తరిస్తోందని నివేదిక పేర్కొంది. స్వచ్ఛమైన గాలిని శ్వాసగా తీసుకునే వారితో పోలిస్తే.. కలుషితమైన గాలిని శ్వాసించే వారి ఆయుర్దాయం ఎలా ఉంటుందనే అంశంపై షికాగో యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో గాలి నాణ్యత గణనీయంగా క్షీణించిందని ఈ నివేదిక వెల్లడించింది. ఈ రాష్ట్రాల్లో కాలుష్య తీవ్రత కారణంగా ఇక్కడి ప్రజల ఆయుర్దాయం 2.5 నుంచి 2.9 సంవత్సరాల వరకు తగ్గిపోవచ్చని తెలిపింది.

యువతరానికి విప్లవనాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అమెరికాకు చెందిన లీబర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్రెయిన్ డెవలప్ మెంట్ సంస్థ, చైనాలోని ఓ యూనివర్సిటీ కలిసి వాయు కాలుష్యం వల్ల మానసికారోగ్యంపై పడే ప్రభావాన్ని గుర్తించే పరిశోధనను చేశారు. దీనికోసం 40 దేశాల నుంచి డేటాను తెప్పించారు. వాయు కాలుష్యానికి, డిప్రెషన్‌కు మధ్య ఉన్న బంధాన్ని కనుగొన్నారు. వాయు కాలుష్యం డిప్రెషన్‌కు కారణమయ్యే జన్యువుల పనితీరును మార్చడం ద్వారా మానసిక జబ్బుల బారిన పడేలా చేస్తాయని చెబుతున్నారు పరిశోధకులు. దాదాపు 352 మంది ఆరోగ్యవంతులైన మానవులపై ఈ అధ్యయనం సాగింది. 'అధిక కాలుష్య ప్రాంతాలలో నివసించే ప్రజలు ఎక్కువగా నిరాశకు గురవుతుంటారు. ఉత్సాహం కూడా తగ్గుతుంది. ఎందుకంటే వారి జన్యువులు, వాయు కాలుష్యం వల్ల మార్పు చెందుతాయి. దీని వల్ల చిన్న చిన్న సమస్యలే చాలా పెద్దవిగా కనిపించి మానసికంగా ప్రభావం చూపిస్తాయి. అంతేకాదు వాయు కాలుష్యం వల్ల అనేక శారీరక వ్యాధులు కూడా వస్తున్నాయి. ఒక్క 2019 సంవత్సరంలోనే వాయుకాలుష్యం కారణంగా భారత దేశంలో 16.7లక్షలమంది మరణించారు. దేశం సుమారు రూ. 2 లక్షల 60 వేల కోట్ల రూపాయలకు పైగా నష్టపోయిందని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐసీఎంఆర్ ఒక నివేదికలో పేర్కొంది. ఇండియా స్టేట్ లెవెల్ డిసీజ్ బర్డన్ ఇనిషియేటివ్ పేరుతో ఒక అధ్యయన నివేదిక వచ్చింది. కాలుష్యం కారణంగా జిడిపీలో 1.4 శాతం అంటే అక్షరాల రెండు లక్షల 60వేల కోట్ల రూపాయలను ఈ కాలుష్యం కారణంగా గత సంవత్సరం భారతదేశం నష్టపోయిందని నివేదిక వెల్లడించింది.

ఢిల్లీ వాయు కాలుష్యంపై చికాగో వర్సిటీలోని ఎనర్జీ పాలసీ ఇనిస్టిట్యూట్ సంచలన విషయాలు బయటపెట్టింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ప్రమాణాల కంటే ఢిల్లీలో వాయుకాలుష్యం 21రెట్లు అధికంగా ఉందని బయటపెట్టింది. పరిస్థితి మారకపోతే దేశ రాజధాని ప్రజల ఆయుర్దాయం 10 ఏళ్ళు తగ్గిపోతుందని హెచ్చరించింది. కాగా 2013 నుంచి ప్రపంచవ్యాప్తంగా 44 శాతం కాలుష్యం ఒక్క భారతదేశం నుంచే వస్తోందని ఈ సంస్థ నివేదించింది. ఇక ప్రపంచంలోనే కాలుష్యం అధికంగా ఉన్న దేశాల్లో ఇండియా రెండో స్థానంలో ఉందని ఈ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ గుర్తుచేసింది.


వాయు కాలుష్యాన్ని లెక్కించే పార్టిక్యులేట్ మ్యాటర్ అంటే పి.ఎం.25 సూచి ఢిల్లీలో తరచు 400 కన్నా అధికంగా ఉంటుంది. ఇది ఎంత ఎక్కువంటే అంతర్జాతీయంగా ఇతర నగరాలతో పోల్చిచూస్తే మన పరిస్థితి అర్థమవుతుంది. PM 25 సూచి లండన్‌లో 17 ఉండగా, న్యూయార్క్‌లో 38, బెర్లిన్‌లో 20, బీజింగ్‌లో 59గా ఉంది. 2019లో భారతదేశంలో 16.7లక్షల మంది మరణానికి వాయు కాలుష్యమే కారణమని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ నివేదికలో స్పష్టం చేసింది. ఊపిరి తిత్తుల సమస్యల్లో 40% కేసులకు వాయు కాలుష్యమే కారణమని ఐసీఎంఆర్ డైరక్టర్ బలరామ్ భార్గవ గతంలో పేర్కొన్నారు. రాజధాని దిల్లీ నగరంలో PM 2.5 సూచి 300 వద్ద ఉంటే ఆ నగరంలో నివసించే ప్రతివ్యక్తి 15 సిగరెట్లు తాగిన దానికి సమానమైన పొగను పీల్చినట్లు లెక్క. ఇందులో పసి పిల్లలు కూడా ఉంటారు. వాయు కాలుష్యం పిల్లల మానసిక ఎదుగుదలను ప్రభావితం చేస్తుందని సర్వేలు చెబుతున్నాయి.

భారత్‌లో వాయు కాలుష్యం గతంతో పోలిస్తే మరింతగా దిగజారిందని స్విస్ ఐక్యూఎయిర్ తాజాగా విడుదల చేసిన "ప్రపంచ వాయు నాణ్యత నివేదిక 2021" తెలిపింది. ఈ రిపోర్ట్ ప్రకారం.. ప్రపంచంలో వాయు కాలుష్యం అధికంగా ఉన్న 100 నగరాల్లో భారత్‌లోనే 63 ఉండటం గమనార్హం. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల జాబితాలో రాజస్థాన్‌లోని భివాండీ తొలిస్థానంలో ఉండగా.. ఉత్తరప్రదేశ్‌లోని ఘాజియాబాద్ రెండో స్థానంలో, చైనా నగరం హెూటన్ మూడో స్థానంలో, ఢిల్లీ నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ జాబితాలోని టాప్ 15లోని 10 భారతీయ నగరాలు ఢిల్లీ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. మొత్తం 63 నగరాలు ఉండగా.. సగానికి కంటే ఎక్కువ హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్‌లకు చెందినవే కావడం గమనార్హం. ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి మెరుగ్గా ఉంది. తమిళనాడు, కర్ణాటకల్లో ప్రతి ఘనపు మీటరుకు ధూళికణాలు 40 మైక్రో గ్రాములకు లోపునే ఉన్నాయి. తెలంగాణాలో మాత్రం కాలుష్యం తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ఓజోన్ కాలుష్యం పరంగా ఆరంజ్ జోనులో చేరాయి.

రానున్న తరాల ఆరోగ్యాన్ని కాపాడ్డానికి, ఆర్థిక వ్యవస్థను రక్షించుకోడానికి తక్షణం వాయుకాలుష్యం సమస్యను పరిరక్షించుకోవడం అవసరం. పర్యావరణ పరిరక్షణ ద్వారా వాయుకాలుష్యాన్ని చాలా వరకు అరికట్టగలం. కాలుష్య కారక పరిశ్రమలపై నియంత్రణ, కాలుష్యాలను తొలగించడంతో పాటు చెట్లు నాటడం ద్వారా వాయుకాలుష్యాన్ని నివారించగలం.

"ప్రళయం వస్తున్నా సరే నీ చేతిలో ఒక మొక్క ఉంటే దాన్ని భూమిలో నాటు" అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స). మొక్కలు నాటడం, పర్యావరణాన్ని కాపాడ్డం ఎంత ముఖ్యమో ఈ మాటల వల్ల తెలుస్తోంది.

**మనసుల్లో విద్వేషం నిండి ఉంటే మనిషి మనస్సు సానుకూలంగా ఆలోచించలేదు. అలాంటి మనిషి ప్రతి విషయాన్ని ప్రతికూల ధోరణితోనే చూడడానికి అలవాటు పడిపోతాడు. చివరికి అతను నిర్మాణాత్మక పని చేయలేకపోతాడు.**




మన దేశంలోని ఒక వర్గం వారి ధోరణి ఇలాగే మారిపోయింది. ఇటీవల ఉత్తరప్రదేశ్ బరేలీ జిల్లాలోని ఒక గ్రామ పాఠశాలలో సుప్రసిద్ధ కవి అల్లామా ఇఖ్బాల్ గేయం 'లబ్ పె ఆతీ హయ్ దుఆ బన్ కె తమన్నా మేరీ' పాడటం వివాదానికి దారి తీసింది. అల్లామా ఇఖ్బాల్ ఈ గేయం 1908లో రాశారు. ఈ గేయం ఎంతో ప్రఖ్యాతి చెందింది. ఇందులోని వినియోగించిన పదాలు, దీని భావం చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరినీ ఆకర్షిస్తుంది. ఈ గేయం సుదీర్ఘ కాలంగా పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ప్రార్థనగా చదివిస్తున్నారు. దేశంలో విద్వేష, శత్రుత్వ వాతావరణం నెలకొల్పి రాజకీయ పబ్బం గడపాలనుకునే కొందరికి ఈ ప్రార్థన (దుఆ), ఇందులో వినియోగించిన పదాలు కూడా మత మార్పిడికి ''కుట్ర''గా అనిపించింది. దీనిపై వారు పెద్ద వివాదాన్ని సృష్టించారు.

అసలేం జరిగిందంటే, బరేలీలోని ఒక పాఠశాలలో ప్రతి రోజు మాదిరిగానే ఆ రోజు కూడా ఉదయం అసెంబ్లీలో పిల్లలు అల్లామా ఇఖ్బాల్ రచించిన గేయం పాడసాగారు. కొందరు దానిని వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఆ వీడియోలో పిల్లలు అల్లామా ఇఖ్బాల్ గేయంలోని ఒక చరణం "మేరే అల్లాహ్! బురాయిసే బచానా ముఝ్కో" పాడుతున్నారు. అందులో అల్లాహ్ అనే పేరు వినగానే కొందరు నానా హంగామా సృష్టించారు. పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలతో బలవంతంగా ఈ ప్రార్థన చేయిస్తున్నారని, ఈ ప్రార్థన ద్వారా పిల్లల మతమార్పిడి చేయడానికి కుట్ర జరుగుతోందని గగ్గోలు పెట్టారు. విశ్వహిందూ పరిషద్ బాధ్యులయితే ఒకడుగు ముందుకేసి విద్యా శాఖలో ఫిర్యాదు కూడా చేశారు. అక్కడితో ఆగకుండా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయించారు. ఆ సమయంలో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడు ఈ ప్రార్థన పాఠశాలల సెలబస్‌లోనే ఉంది. దీనిని ఈ రోజే కాదు ప్రతి రోజు అసెంబ్లీ సందర్భంగా పిల్లల్లో మంచి లక్షణాలు అలవడేందుకు చదివిస్తారని ఎంతగా వాపోయినా, వివరణ ఇవ్వడానికి ప్రయత్నించినా ఆయన మాట ఎవరూ వినలేదు. ఎవరూ పట్టించుకోలేదు. యూపీ విద్యా శాఖ అధికారులు ఉదయం అసెంబ్లీ సందర్భంగా తప్పనిసరి విషయాలలో ఇది లేదని, ఈ గేయం చదివించడం నిబంధన లకు విరుద్ధం అంటూ ఒక వర్గం వారిపై విషం కక్కారు. ఈ గేయ పఠనంపై ఫిర్యాదు చేసిన విశ్వహిందూ పరిషద్ బాధ్యులు ఈ గేయం ద్వారా హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని అభియోగం మోపడం విడ్డూరంగా ఉంది.

వాస్తవం ఏమిటంటే, ఈ గేయం ఏ మతానికి చెందింది కాదు, ఏ వర్గానికీ ప్రాతినిధ్యం వహించదు. ఇందులో అమాయకుడైన ఒక పిల్లవాడు ప్రజలకు ప్రయోజనం చేకూర్చే జీవితం ప్రసాదించమని, చెడుల నుంచి కాపాడమని దేవుడిని ప్రార్థిస్తాడు. దీనికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, అల్లామా ఇఖ్బాల్ ఈ దుఆను ఒక ఆంగ్ల కవి మెటిల్డ్ బేథమ్ ఎడ్వర్డ్స్ రాసిన సుప్రసిద్ధ గేయం ''ఓ చైల్డ్ హాయిమ్''కు ప్రభావితులై రాశారు.

కాని ముస్లిముల పట్ల ఉన్న విద్వేషం, వివక్ష కారణంగా కొందరు ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారు.

ప్రస్తుతం మన దేశం పేదరికం, నిరుద్యోగం, అవినీతి, అనైతికత మొదలగు సామాజిక సమస్యలతో సతమతమవుతోంది. కాని కొందరు వీటన్నిటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి చిన్న చిన్న విషయాల ద్వారా ప్రజల మనస్సులో విద్వేషం నింపుతున్నారు. ప్రజలు వారి కుతంత్రాలను ఎంత త్వరగా పసిగడితే అంత ఎక్కువ ప్రయోజనం. **('దావత్' సౌజన్యంతో...)**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది      ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

54 ఆయత్‌లు

# 41. హా మీమ్ అస్ సజ్దా

మక్కా అవతరణ

**21-25** వారు తమ శరీర చర్మాలను అడుగుతారు, "మీరు మాకు వ్యతిరేకంగా సాక్ష్యమెందుకు ఇచ్చారు" అని. అవి సమాధానంగా చెబుతాయి, ప్రతి వస్తువుకూ మాటలాడజేసిన ఆ ప్రభువే మాకూ మాటలాడే శక్తి నిచ్చాడు.[26] ఆయనే మిమ్మల్ని తొలిసారి పుట్టించాడు, ఇప్పుడు ఆయన వైపునకే మీరు తిరిగి మళ్ళించబడుతున్నారు. మీరు ప్రపంచంలో అపరాధాలు చేసేటప్పుడు దాక్కునేవారు. అప్పుడు మీకు ఎన్నడూ ఈ ఊహ రాలేదు, ఏనాడయినా మీ స్వంత చెవులూ, మీ కళ్ళూ, మీ శరీర చర్మాలూ మీకు వ్యతిరేకంగా సాక్ష్యం పలుకుతాయేమోనని. నిజానికి మీరయితే మీ చేష్టలనేకం గురించి అల్లాహ్‌కు కూడా ఎరుకలేదని తలపోసేవారు. మీ ప్రభువు పట్ల మీ ఈ అనుమానమే మిమ్మల్ని ముంచివేసింది, దీని మూలంగానే మీరు బహునష్టానికి లోనయ్యారు."[27] ఈ పరిస్థితిలో వారు సహనం వహించినా (వహించకపోయినా) అగ్ని ఒక్కటే వారి నివాసం. వారు వెనిక్కి మరలే అవకాశాన్ని కోరుకున్నా వారికి ఎలాంటి అవకాశమూ ఇవ్వడం జరగదు.[28] మేము వారి కొరకు నియోగించిన సహచరులు వారికి ముందూ వెనక ప్రతిదీ అందమయినదిగా తీర్చిదిద్ది చూపెట్టేవారు.[29] చివరికి వారికి పూర్వం గతించిన జిన్నులూ మానవుల వర్గాలకు విధించబడిన శిక్షా నిర్ణయమే వారికీ విధితమయింది. నిస్సందేహంగా వారు నష్టానికి లోనయిపోయినవారే.

26. దీన్నిబట్టి మానవుని స్వంత అవయవాలు మటుకే సాక్ష్యం పలుకవు, మనిషి ఏ ఏ వస్తువుల సమక్షంలో పని చేస్తాడో ఆ వస్తువులన్నీ మాటలాడటం మొదలెడతాయని తెలుస్తోంది. ఇదే విషయాన్ని అజ్ జిల్‌జాల్ సూరాలోనూ సెలవీయడం జరిగింది: "భూమి తనలోని బరువులనన్నింటినీ తీసి బయట పడ వేసినప్పుడు, దీనికి ఇదంతా ఏమయిపోతోంది? అంటూ మనిషి చకితుడయినప్పుడు - అదిగో ఆ రోజున అది తన (కు సంభవించిన) విషయాలన్నీ వివరిస్తుంది. ఎందుకంటే నీ ప్రభువు (అలా చేయమని) దానికి ఆదేశించి ఉంటాడు." (అజ్ జిల్‌జాల్ 2-5).

27. హజ్రత్ హసన్ బస్రీ(రహ్మాహుల్లా) ఈ ఆయత్ వివరణలో చాలా బాగా సెలవిచ్చారు. ప్రతి వ్యక్తి వైఖరి, అతను తన ప్రభువును గురించి ఊహించుకున్న అనుమానాన్ని అనుసరించి నిర్ధారణ అవుతుంది. సజ్జనుడయిన విశ్వాసి వైఖరి సవ్యంగా ఉంటుంది, ఎందుకంటే అతను తన ప్రభువు విషయంలో సరయిన ఊహే కలిగి ఉంటాడు. తిరస్కారి, కపటాచారి, పాపాతురుడు, దౌర్జన్యశీలుడు అయినటువంటి వాని వైఖరి తప్పుగానే ఉంటుంది. ఎందుకంటే తన ప్రభువును గురించి అతని అనుమానమూ తప్పయినదిగానే ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) ఎంతో సమగ్రమయిన ఒక క్లుప్తమయిన హదీసులో సెలవిచ్చారు: "మీ ప్రభువు ఇలా అంటున్నాడు, ........ "నా దాసుడు నా గురించి కలిగిఉన్న అనుమానంతో పాటే నేను ఉంటాను" *(బుఖారి, ముస్లిమ్).*

28. దీని భావం ఇలా కూడా కాగలదు, ప్రపంచం వైపునకు మరలదలిస్తే మరలలేరు అన్నది. ఇది కూడా సాధ్యమే, నరకం నుండి బయటపడాలని అనుకుంటే బయటపడలేరు అన్నది. ఇంకా పశ్చాత్తాపం చెంది, క్షమాపణ కోరుకోదలిస్తే దానిని స్వీకరించడం జరగదు అన్నది కూడా కావచ్చు.

29. ఇది పరమ ప్రభువు అల్లాహ్ అనుసరించే స్థిరమయిన, శాశ్వత సంప్రదాయం. ఆయన చెడు సంకల్పం, చెడు కోరి కలు పెంచుకునే మానవులకు ఎన్నడూ మంచి సహచరులను ఇప్పించడు. వారికి వారి ప్రవృత్తుల రీత్యా చెడు సహచరులనే ఇప్పిస్తాడు. ఆపైన వారు ఎంతగా చెడు పతనాలలో లోతుగా పాతుకుపోతూ ఉంటారో అంతగానే దుష్టతరమయిన మనుషులు, షైతానులూ వారికి తోడవుతూ ఉంటారు. వారే వారి సలహాదారులు, సహచర కార్యకర్తలుగా రూపొందుతూ ఉంటారు.

**(29వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (4వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## 8. సృష్టి ఆరంభ ప్రకరణం

**591)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రబోధించారని హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించారు: "రాత్రి చీకటి అలుముకుంటున్నప్పుడు లేదా రాత్రి అవుతున్న పుడు మీ పిల్లల్ని మీ వద్దనే (ఇండ్లల్లోనే) ఆపి ఉంచండి. ఎందుకంటే షైతానులు (పైశాచిక శక్తులు) ఆ సమయంలోనే భూమిలో విస్తరిల్లుతుంటారు.[1] మరి ఇషా వేళ ఒక గడియ గడిచిన తరువాత వారిని విడిచిపెట్టండి. ఆ తరువాత దేవుని పేరుతో మీ తలుపును మూసివేయండి. అల్లాహ్ పేరుతో మీ దీపాలను ఆర్పి వేయండి. అల్లాహ్ పేరుతో నీళ్ళ పాత్రలపై మూతలు వేయండి. ఇతరత్రా పాత్రలను కూడా అల్లాహ్ పేరుతోనే మూసివేయండి. ఒకవేళ మూకుడు లేకపోతే వేరితర వస్తువు ఏదన్నా వాటిపై అడ్డంగా ఉంచండి."

**592)** విశ్వాసుల మాత హజ్రత్ సఫియ్యా బిన్తె హుయ్యి (ర.అ) తెలిపారు: దైవప్రవక్త(సఅసం) 'ఏతెకాఫ్' వ్రతం పాటిస్తూ ఉండగా నేను రాత్రివేళ ఆయనతో మాట్లాడటానికి (మస్జిద్‌లోనికి) వెళ్ళాను. కొంతసేపు ఆయన(స)తో మాట్లాడుతూ గడిపాను. తరువాత నేను తిరిగి రావడానికి లేచి నిలబడినప్పుడు, ఆయన(స) కూడా నన్ను సాగనంపడానికి నాతో వచ్చారు – ఉమ్ముల్ మోమినీన్ సఫియ్యా (ర.అ) నివాస గృహం ఉసామా బిన్ జైద్(రజి) ఇంట్లోని ఒక భాగమే – ఆ సమయంలో ఇద్దరు అన్సార్ సహాబీలు (ఉసైద్ బిన్ హుజైర్, అబ్బాద్ బిన్ బిష్ర్) అటువైపుగా నడచి వెళుతున్నారు. వారు దైవప్రవక్త(స)ను చూడగానే, వడివడిగా నడవసాగారు. అప్పుడాయన(స) వారినుద్దేశించి, "కాస్త ఆగండి, ఈవిడ ఎవరో కాదు, సఫియ్యా బిన్తె హుయ్యి" అని చెప్పారు. దానికి వారిద్దరూ, 'సుబ్‌హానల్లాహ్! యా రసూలల్లాహ్ (మేము మీ విషయంలో సంశయానికి లోను కాగలమా!?)' అని పలికారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "షైతాన్ మనిషి శరీరంలో రక్తం మాదిరిగా ప్రవహిస్తాడు. అందుకే, వాడు మీ ఆంతర్యాలలో కూడా శంకలు వేస్తాడేమోనని నేను భయపడ్డాను."[1]

**596)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "నమాజ్ కొరకు అజాన్ పిలుపు ఇచ్చినప్పుడు, షైతాన్ వీపు తిప్పుకుని, పెడబొబ్బలు పెడుతూ, అపానవాయువు విసర్జిస్తూ పారిపోతాడు. అజాన్ ఇవ్వటం ముగియగానే మళ్ళీ తిరిగి వస్తాడు. తక్బీర్ చెప్పటం మొదలెట్టినప్పుడు మళ్ళీ పలాయనం చిత్తగిస్తాడు. తక్బీర్ ముగియగానే మళ్ళీ తిరిగి వచ్చి (నమాజ్ చేసే) మనిషి హృదయంలో కలతలు రేపుతాడు. 'ఫలానా విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకో, ఫలానా మాటను గుర్తుకు తెచ్చుకో' అని ప్రేరేపిస్తుంటాడు. తత్ఫలితంగా అతనికి నమాజ్ మూడు రకతులు చేశానా? లేక నాలుగు రకతులు చేశానా? అన్నది జ్ఞాపకం ఉండదు. ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు మరపునకు సంబంధించిన రెండు సజ్దాలు చేసుకోవాలి".

591-1. నేలలో విస్తరిల్లే షైతానులు అంటే, దుష్టశక్తులైన జిన్నులు అని అర్థం. 'అవి విషసర్పాలని' మరికొందరు అభిప్రాయపడ్డారు. సాధారణంగా ఆ వేళలోనే పాములు తమ తమ కన్నాల (పుట్టల)లో నుంచి చల్లని గాలుల్ని పీల్చడానికి బయటికి వస్తుంటాయి.

592-1. రాత్రివేళ దైవప్రవక్త(స) తన భార్యతో కలసి వెళుతున్నపుడు ఎదురుపడిన ఇద్దరు సహచరులు పక్కా విశ్వాసులే. అయినపుటికీ వారి ఆంతర్యాలలో సంశయం, అనుమానం రావడానికి ఆస్కారం లేకపోలేదు. ఎందుకంటే షైతాన్ ఇలాంటి అవకాశాల కోసమే ఎదురు చూస్తుంటాడు. అందుకే దైవ ప్రవక్త (స) వారిద్దరినీ కేకవేసి పిలుస్తూ 'ఈవిడ నా భార్య' అని స్పష్టం చేయాల్సి వచ్చింది.

★★★

# మహోన్నత విజయం 57



**- ఎస్.ఎమ్. మలిక్**

**ప్రవక్త** మహనీయుల బిడారు, హుదైబియా సంధి ఒప్పందాన్ని తన పరాజయంగా ఊహించుకుంటూ మదీనా వైపునకు తిరుగు ముఖం పట్టింది. సహచరమాన్యులు ప్రవక్త(శ్రీ బోధనలననుసరించి బాహ్యంలో తృప్తి కనబరిచినా ఆంతర్యంలో వారికి ఇలా ఉమ్రా చేయకుండా తిరోన్ముఖులవడం ఇబ్బందికరంగానే ఉండేది. కురాఉల్ గమీమ్ అనే చోట ప్రవక్త మహనీయులకు అల్ ఫత్హ్ సూరాలో ఓ ఆయత్ అవతరించింది:

**ప్రవక్తా! మేము నీకు ప్రస్ఫుటమయిన విజయాన్ని ప్రసాదించాము. (అల్ ఫత్హ్ 48: 1)**

అంటే దేన్నయితే ముస్లిమ్ యోధులు పరాజయమని తలుస్తున్నారో అది వాస్తవానికి మహత్తరమయిన విజయం!

అది అవతరించగానే ప్రవక్త(శ్రీ(స) ముస్లిములందరినీ ఓ చోట ప్రోగు చేసి "ఈ వేళ నాకు అవతరించినది, నా కొరకు ప్రపంచం, అందులోని సమస్తం కన్నా విలువయినది" అని చెప్పి ఆ సూరాను పారాయణం చేశారు.

ఆ పైన ఆయన ప్రత్యేకంగా మహనీయ ఉమర్(ర)ని పిలిపించి దాన్ని వినిపించారు, ఎందుకంటే అందరికన్నా అధికంగా చింతిల్లినవారు ఆయనే!

## దైవిక శుభం

అంతకు కాస్త ముందే ఈ బిడారు క్యాంపు వేసినప్పుడు బిడారు లోని జనం ప్రవక్త మహనీయులకు తమ క్షుద్బాధను గురించి విన్నవించుకుని తమ వాహనాలను (ఒంటెల్ని) జిబ్హ్ చేసి భుజించేందుకు అనుమతిని కోరారు. ప్రవక్త(శ్రీ(స) వారి బాధను చూడలేక అనుమతినిచ్చారు.

కాని మహనీయ ఉమర్(ర)కు తెలిసినప్పుడు ఆయన ప్రవక్త వద్దకు వచ్చి, "ప్రవక్తా! అలా వాహనాలను జిబ్హ్ చేయడం సముచితం కాదు. ఎవరెవరి వద్ద ఏమాత్రం భోజన సామగ్రి ఉందో అది తెచ్చి తమరి వద్ద సమర్పించుకునేందుకు ఆదేశమివ్వండి, ఆ పైన మీరు అందులో శుభం కలుగజెయ్యమని దైవాన్ని ప్రార్థించండి. మీ ప్రార్థన వల్ల అందులో 'బర్కత్' (దైవికంగా పెరుగుదల) ప్రాప్తమవుతుంది. అదే చాలు!" అని సలహా ఇచ్చారు. మున్ముందు ఎటువంటి పరిస్థితులు ఏర్పడతాయో, వాహనాలు భద్రంగా ఉండటం ఎంతో అవసరమన్నది ఆయన వాదన!!

ఆ సలహా ప్రకారమే, ఓ పెద్ద చర్మం దుప్పటిని దస్తర్‌గా పరిచారు. అందరూ తమ వద్ద ఉన్న భోజనం, ఏమాత్రం ఉన్నా అది తెచ్చి దాని మీద ఉంచారు. అదంతా ఓ చిన్న కుప్పగా ప్రోగయింది. ప్రవక్త మహనీయులు దాని సమక్షాన నిలబడి ప్రార్థన చేశారు. ఆపైన జనం వచ్చి దాని చుట్టూ చేరి భుజించసాగారు. అందరూ తృప్తిగా భోంచేసిన తరువాత, ఆ భోజనం ఇంకా అలాగే ఉండింది. జనం తమ పాత్రలు తెచ్చుకుని నింపుకోసాగారు. ఆ తరువాత కూడా ఆ భోజనం ముందులానే యథాతథంగా ఉండింది!

అప్పుడు ప్రవక్త(శ్రీ(స) ఎంతో తృప్తిగా మనసారా నవ్వారు, అలా నవ్వగా ఆయన దవడ పల్లు కనిపించాయని ఉల్లేఖించారు సహచరమాన్యులు. ఆ సమయంలో ప్రవక్త(శ్రీ(స) ఇలా అన్నారు:

> “అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని, నిశ్చయంగా నేను నిజమయిన దేవుని సందేశహరుణ్ణని సాక్ష్యమిస్తున్నాను. దైవం సాక్షి! ఈ రెండు విషయాలను విశ్వసిస్తూ ఎవరు దైవాన్ని కలుసుకుంటాడో అతన్ని నిశ్చయంగా అల్లాహ్ నరకానికి దూరం చేసి కాపాడుతాడు.”

## ఇది విజయం!

హుదైబియా నుండి తిరిగి వస్తూ ఉండగా సహచరులు ఒకరు “ఇది విజయం కాదు, మనల్ని దైవ గృహం దర్శనం చెయ్యకుండా ఆపివెయ్యడం, మా పశుత్యాగాలను సయితం ఆపివేయడం, ఇద్దరు విశ్వాసులు ప్రవక్త వద్దకు రాగా వారిని తిరిగి అవిశ్వాసులకు అప్పజెప్పడం- ఇది విజయమెలా అవుతుంది?” అని అన్నారు.

ఈ విషయం ప్రవక్త మహనీయులకు తెలిసినప్పుడు ఆయన(స) ఇలా బోధించారు తన సహచరులకు:

> “ఇలా చెప్పడం చాలా తప్పు. వాస్తవానికి ఈ సంధి ఒడంబడిక బృహత్తరమయిన విజయం. బహుదైవారాధకులు ఒకప్పుడు మీకు గుర్తింపునే ఇవ్వలేదు, ఇప్పుడు మిమ్మల్ని సంతోషంగా మక్కాకు ఆహ్వానిస్తున్నారు. వారు మీతో సంధి చేసుకునేందుకు ఉత్సాహంతో ఉన్నారు. మీ నుంచి శాంతిని శ్రేయాన్ని కాంక్షిస్తున్నారు. వారు ఒకప్పుడు మిమ్మల్ని చూడటానికీ సమ్మతించలేదు. కాని నేడు వారు ఈ స్థాయికి వచ్చారు. ఇది దైవం ప్రసాదించిన విజయం కాదా? ఆయన మీకు ఎన్నో బహుమానాలతో క్షేమంగా తిరిగి వచ్చే సౌకర్యం కల్పించాడు. ఇందువల్ల కూడా ఇది ఘన విజయమే.
>
> “మీరు ఉహుద్ దినాన్ని మరచిపోయారా? మీరు భయంతో పారిపోతూ ఉండగా, వెనక్కి తిరిగి చూడకుండా పారిపోతూ ఉండగా నేను వెనుక నుంచి కేకలు వేసి పిలిచిన ఉదంతాన్ని, ఆ సందర్భాన్ని మరిచిపోయారా? మీకు కందకం పోరాట దినం గుర్తు లేదా? శత్రువులు మిమ్మల్ని నలువైపుల నుండి చుట్టుముట్టగా మీ కనుగుడ్లు తేలిపోయాయే! మీ గుండెలు గొంతుకలోకి వచ్చేశాయే!! మీరు ఎటువంటి అనుమానాలకు గురయ్యారు ఆనాడు?”

జనం ఈ మాటలు విని, “దైవం, దైవప్రవక్త నిజం పలికారు. నిస్సందేహంగా ఇది ముమ్మాటికీ మహత్తర విజయమే. దైవం మీద ఒట్టు! మేము ఈ విధంగా ఆలోచించలేకపోయాము. దైవ నిర్ణయాలను గురించి నిజానికి మీకే బాగా తెలుసు. మా మంచీ చెబ్బరలు సయితం మీకే బాగా తెలుసు!” అని పశ్చాత్తాపం వెలిబుచ్చారు.

ఇదంతా సంభవించిన కొన్నాళ్ళకే అందరికీ బాగా అర్థమయిపోయింది, హుదైబియా ఒప్పందం ఏవిధంగా గొప్ప విజయంగా పరిణమించిందో!

## నెమ్మది మహా వరం!

హుదైబియా సంధిని ప్రస్ఫుట విజయం అనడంలో మరో అంశమూ లీనమయి ఉంది. పరమ ప్రభువు అల్లాహ్ విశ్వాసుల ఆంతర్యాలకు నెమ్మదితో సంభూషితం చేసి ఇలా ప్రవచించాడు:

> “ఆయన విశ్వసించిన వారి హృదయాలలో నెమ్మదిని, తృప్తిని, మనోస్థయిర్యాన్ని అనుగ్రహించినవాడు. తద్వారా వారు తమ విశ్వాసాన్ని మరో వంతు విశ్వాసంతో వృద్ధి చేసుకోవాలని” (అంటే ‘విశ్వాసం ద్విగుణీకృతమవ్వాలని’ అని అర్థం) (అల్ ఫత్హ్ 48: 4)


పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఈ నెమ్మదిని ప్రసాదించడం కూడా ముస్లిముల విజయానికి మూలాధారంగా పేర్కొన్నాడు.

దైవం ప్రసాదించిన ఆ నెమ్మది వర ప్రసాదం మూలంగానే విశ్వాసులు, హుదైబియా సంఘటన సందర్భంగా అడుగడుగునా ప్రశాంత మనస్కులయి మెలిగారు. అది ఎలాగో కాస్త పరిశీలిద్దాము-

1) దైవ సందేశహరులు(స) ఉమ్రా చెయ్యడానికి మక్కా పుణ్యపురికి వెళ్ళాలని సంకల్పం ప్రకటించినప్పుడు ముస్లిములు, భయం మూలంగా, ఇలా వెళ్ళడం కపటులు అనుకున్నట్లు సరిగ్గా మృత్యు ముఖంలోకి చొరబడటమే అని అనుకుని ఉంటే ఎలా ఉండేది- అప్పుడు దైవం వారికి నెమ్మదినిచ్చి సంతృప్తపరిచాడు.

2) దారిలో ముస్లిములను ఎదుర్కొని మక్కాలోకి ప్రవేశించకుండా చెయ్యాలని మక్కా విరోధులు అనుకున్నట్లు సమాచారం అందిన ప్పుడు సయితం ముస్లిములు గాభరా పడకుండా నెమ్మదినిచ్చి ఆదుకున్నాడు అల్లాహ్.

3) హుదైబియాలో ముస్లిములను ముందుకు సాగకుండా కురైషీలు తమ పోకిరి జనంతో నానా విధాలుగా ముస్లిములను కయ్యానికి దిగేలా పురికొలినప్పుడు ముస్లిములు ప్రశాంత హృదయులయి సంయమనం పాటించారు.

4) మహనీయ ఉస్మాన్(ర) హత్య గురించి పుకారు లేవనెత్తినప్పుడు కూడా ముస్లిములు ఎంతో నిగ్రహం పాటించి సముచితమయిన చర్యను గురించి మాత్రమే ఆలోచించారు.

5) ఇక కడసారిగా, అబూ జన్దల్ గాయాలతో శరణు కోరి రాగా ఆయన్ని ఒప్పందాన్ననుసరించి, గుండెను బండ జేసుకుని నిర్దయుడయిన అతని తండ్రితో పంపవలసి వచ్చినప్పుడు సహచర మాన్యులు చూపిన సహన స్థయిర్యాలు అనన్యమయినవి.

ఈ సందర్భాలలో కన్నా మరీ ఆవేశపూరితమయిన ఘడియలు, కురైషీల షరతులకు తలొగ్గి సంధి చేసుకున్నప్పుడు ఆసన్న మయ్యాయి. ఈ సందర్భాలన్నింటిలో ముస్లిములు ఏమాత్రం అవిధేయత కనబరిచినా ఈ మహత్పూర్వకమయిన ఘన విజయం ముస్లిముల స్వంతం కాకపోయేది.

అల్ ఫత్హ్ సూరాలో దైవం నెమ్మది ప్రసాదించిన ప్రస్తావన మూడు చోట్ల వచ్చింది. ఈ సంతృప్తి, మానసిక స్థిమితం, నెమ్మది కారణం గానే ముస్లిములు ఈ ప్రయాణంలోనూ ఆ సందర్భంలో ఎదుర యిన ఆగ్రహం ప్రేరకాల అవకాశాల్లోనూ, మానవ సహజంగా కొంత వైక్లబ్యానికి గురయినా ప్రవక్తశ్రీ మార్గదర్శకత్వం వల్ల తిరిగి ప్రశాంతతను ప్రదర్శించగలిగారు. అదే ఆ నెమ్మది వరప్రసాదం వల్ల లభించిన ఘనమయిన ప్రయోజనం.

## విశ్వాస వికాసం

హుదైబియా సందర్భంలో అవతరించిన సూరా, అల్ ఫత్హ్ (48)లో ముస్లిముల హృదయాలలో నెమ్మదిని నాటడం మూలంగా వారి విశ్వాసం ద్విగుణీకృతమయినట్లు ప్రవచింపబడింది. విశ్వాసులు తమ కళ్ళారా ప్రవక్త మాటలు, దైవం చేసిన భవిష్యవాణులు నిజమవుతూ ఉండగా చూసినప్పుడు వాస్తవంగానే తమ 'ఈమాన్' లేదా విశ్వాసంలో వృద్ధీవికాసాలు తొణకిసలాడిన అనుభవం ముస్లిములకు కలిగి ఉంటుంది.

విశ్వాసి జీవితంలో అడుగడుగునా ఈ ప్రశ్న ఎదురవుతూనే ఉంటుంది. చివరి శ్వాస వరకు ఇటువంటి పరీక్షలు సయితం వెంటాడుతూనే ఉంటాయి. ఆ సందర్భాలన్నింటిలో దైవధర్మాన్ని అనుసరించేటప్పుడు విశ్వాసి తన ధనప్రాణాలు, భావోద్రేకాలు, ఆకాంక్షలు, తన సమయం, శ్రేయం, ప్రయోజనాలు- వేటినయినా సరే, అన్నింటినయినా సరే దైవ మార్గంలో, ధర్మమార్గంలో ధారపోయడానికి సమాయత్తమయినప్పుడల్లా అతని విశ్వాసంలో వృద్ధీవికాసాలు సంభవిస్తూనే ఉంటాయి.

వాస్తవానికి అల్ ఫత్హ్ (48) సూరా మొత్తం, ఆనాటి పరిస్థితులకు, ఆ సందర్భంలో విశ్వసించిన వారికి దైవం ప్రసాదించిన మహా వరప్రసాదాలకు స్పష్టంగా అద్దం పడుతుంది. దాన్ని అధ్యయనం ద్వారా సర్వం బోధపడుతుంది.

## సంధిలోని శుభాలు

❁ హుదైబియా సంధీ ఒడంబడికలో తిరస్కార వ్యవస్థ ద్వారా ఇస్లామీయ సామూహిక వ్యవస్థ ఉనికిని గుర్తించడం జరిగింది. కురైషీలు ప్రవక్తశ్రీతో ఒప్పందం చేసుకుని ఆయన అధికార సత్తాను, ఆయన, ఆయన అనుయాయులు సాధించిన విజయాలు, ఇస్లామ్ గడించిన విస్తృతిని అంగీకరించారు.

❁ ముస్లిములకు దైవ గృహాన్ని సందర్శించే, కాబా ప్రదక్షిణ చేసే హక్కును సమ్మతించి మక్కావాసులు ఇంతకాలం వారిని ధర్మవిహీనులు అని నిందించినది తప్పు అని ఒప్పుకున్నారు. తద్వారా అరబ్బుల్లో ఇస్లామ్ పట్ల స్వయాన కురైషీలు నాటిన విద్వేషం సన్నగిల్లింది.

❁ పదేళ్ళ నిర్యుద్ధ సంధి వల్ల ముస్లిములకు శాంతి, ఏకాగ్రత లభించాయి. వారు తమ చుట్టు పట్ల ప్రాంతాల్లో వ్యాపించి ఇస్లామ్ ప్రచారంలో నిమగ్నమయ్యే అవకాశం వారికి ప్రాప్తమయింది. హుదైబియా ఒడంబడికకు ముందు 19 ఏళ్ళల్లో జరగని ఇస్లామ్ వ్యాప్తి ఆ తరువాత రెండేళ్ళల్లో జరిగింది.

❁ ఈ నిర్యుద్ధ సంధి వల్ల ఇస్లామ్ వ్యాపించిన ప్రాంతాలన్నింటిలో ఇస్లామీయ సామూహిక వ్యవస్థను పటిష్టపరిచే అవకాశం ప్రాప్తమయింది. ఇంకా ఇస్లామీయ జీవన వ్యవస్థను సమస్త ముస్లిముల వ్యక్తిగత, సాముదాయిక జీవితాల్లో సుస్థిరపరిచే నెమ్మది లభించింది.

❁ కురైష్‌తో ఒడంబడిక వల్ల మదీనాకు దక్షిణాన గల భూభాగం పట్ల నిశ్చింత కలిగి, ఉత్తర, మధ్య అరేబియా భూభాగాల పట్ల దృష్టి సారించేందుకు వీలు కలిగింది.

అలా అనేక ప్రాంతాలు అరేబియాలో ఇస్లామీయ రాజ్యపరిధిలోకి వచ్చేశాయి. యూదుల స్థావరాలు ఎన్నో ఇస్లామీయ రాజ్యానికి లొంగిపోయాయి. అరేబియాలో ఇస్లామ్ శక్తి ఆధిక్యతాభిముఖంగా ప్రగతి గడించసాగింది.

ఇవన్నీ ఆ సంధి వల్ల స్థూలంగా లభించిన ప్రయోజనాలు. ఆ సంధిని ముస్లిములు తమకు కలిగిన అపజయంగాను, కురైషీలు తమ విజయంగా భావించారు. సంధి జరిగిన కొన్నాళ్ళకు మక్కాలో తిరస్కారుల బందీ నుండి ఓ ముస్లిమ్ వ్యక్తి అబూ బసీర్ పారిపోయి మదీనా వచ్చేశారు. ఆయన వెనకాలే కురైషీలు ఇద్దరు వ్యక్తుల్ని బంధించి తిరిగి తెచ్చేందుకు పంపారు. ప్రవక్త మహనీయులు(స) అబూ బసీర్‌ని, ఒడంబడిక ప్రకారం, కురైషీలకు అప్పజెప్పారు. తిరిగి వెడుతూ అబూ బసీర్ ఆ ఇరువురిలో ఒకరిని చంపి వేసి పారిపోయారు. ఆయన ఎర్ర సముద్రం తీరాన, కురైష్ వాణిజ్య బిడారులు వెళ్ళే దారిలో మకాం వేసి కూచుకున్నారు. ఆ తరువాత మక్కా నుండి పారిపోయే ముస్లిమ్ ఖైదీలు, అబూ బసీర్‌తో చేరిపోసాగారు. అలా 70 మంది ప్రోగయ్యారు. వారు కురైషీల వాణిజ్య బృందాలపై దారి దోపిడీ చెయ్యసాగారు. ఆ ఇబ్బందిని తట్టుకోలేక కురైషీలు స్వయంగా వారిని తమ వద్దకు పిలుచుకోవలసిందని ప్రవక్త(స)ని అభ్యర్థించారు. అలా హుదైబియా సంధి ఒడంబడికలోని రెండవ షరతు దానంతట అదే రద్దయిపోయింది.

---

ఆధారం : 1) సీరతున్నబీ కామిల్, ఇబ్ను హిషామ్ : సం.2, పు.385-387

2) సీరతె సర్వరె ఆలమ్ : సం.3; పు.282-288

3) సీరత్ ఇన్‌సైక్లోపీడియా : సం.8; పు.170-172


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# అమూల్య వరాలు అమ్మా నాన్నలు



- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**“మీకు లభించిన అనుగ్రహాలన్నీ కేవలం అల్లాహ్ నుండి వచ్చినవే. అంతేగాక మీకు ఆపదలు వచ్చినప్పుడు కూడా మీరు సహాయం కొరకు ఆయననే మొరపెట్టుకుంటారు కదా”!** (నహ్ల్: 53)

సృష్టిలో ప్రతి ప్రాణికి పుట్టుకతోనే అల్లాహ్ కొన్ని అమూల్య సంపదలిస్తాడు. వాటిలో మాతాపితలు, దేహం, నివాస ప్రదేశం, జీవన కాలం ముఖ్యమైనవి. ఆరోగ్యవంతమైన అంగ వైకల్యం లేని దేహం ఒక సంపద. సుఖవంతమైన, సురక్షిత మైన నివాస ప్రదేశం ఒక సంపద. అన్నింటికంటే విలువైనది ఆయువుగా చెప్పుకొనే జీవితకాలం. ఆ జీవిత కాలంలో అదృష్టవంతులకే మాతాపితల ప్రేమ బహుకాలం దక్కు తుంది. దురదృష్టవంతులు బాల్యంలోనే ప్రథమ సంపదలైన తల్లినో, తండ్రినో లేక ఇద్దరినీ పోగొట్టుకుంటారు. సంతానానికి బాల్యంలో తల్లిదండ్రులు గొప్ప దైవానుగ్రహమే, దానికన్నా గొప్ప అనుగ్రహం సంతానానికి వారి యవ్వనంలో వృద్ధులైన తల్లిదండ్రులు ఉండడం.

మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్కపెట్టదలచినా, మీరు వాటిని లెక్కపెట్టలేరు. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత. (నహ్ల్: 18)

అల్లాహ్ ఇలా హితవు పలుకుతున్నాడు: “తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసలుకోండి. మీ ముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులై ఉంటే వారిని ‘ఉఫ్’ అని కూడా విసుక్కోకండి. కసురుకుంటూ విదిలించి మాట్లాడకండి. వారితో గౌరవంగా మాట్లాడండి. దయార్ద్ర హృదయంతో, వినయంతో వారి ముందు తలవంచి ఉండండి. ‘ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచి పోషిం చారో అలా నీవు వీరిని కరుణించు’ అని ప్రార్థించండి.” (ఖుర్ఆన్ 17:23, 24)

దైవప్రవక్త (స) ప్రవచనం: “వృద్ధులయిన తల్లిదండ్రులు ఇద్దరుగాని లేక వారిలో ఒకరుగాని బ్రతికుండగా (వారికి సేవచేసి) స్వర్గంలో ప్రవేశించలేకపోయిన వాడి ముక్కుకు మన్ను తగల! వాడి ముక్కుకు మన్ను తగల!! వాడి ముక్కుకు మన్ను తగల !!!” ఇలా ఆయన మూడు సార్లు శపించారు. (ముస్లిం)

## ప్రకృతి అంత సహజమైనది కన్నవారి ప్రేమ

అల్లాహ్ సృష్టిని ఎంతో ప్రేమగా, అద్భుతమైన సృజనాత్మ కతతో సృష్టించాడు. ఉదయం నిద్ర లేవగానే కనిపించే

కమనీయ ఉదయ రేఖల్ని ఎందరు కనురెప్పల్లో దాచుకుంటున్నారు? మనం ప్రకృతిలోనే బతుకుతున్నాం, ప్రకృతితోనే బతుకుతున్నాం. కానీ, మనసుతో బతకడం లేదు. అందువల్లే ఆనందం అందరాని అనుభూతిగా ఉంటోంది. మనం వెతుక్కునే చోట ఆనందం కనిపించదు. ఆనందం ఉన్న చోట్లను మనం గుర్తించలేక పోతున్నాం. ఇదే ఉదాహరణను అమ్మానాన్నలకు వర్తింపజేసి ఆలోచించాలి. ఆత్మ సమీక్ష చేసుకోవాలి.

తల్లి ప్రేమలో, తండ్రి ఆలింగనంలో, బిడ్డ నవ్వులో, స్వార్థంలేని భక్తిలో... తేనెలోని మాధుర్యంలా ఆనందం దాగి ఉంది. దాన్ని అనుభూతికి తెచ్చుకోవాలంటే మనకు మనసుతో ఎలా జీవించాలో తెలియాలి. మనసు మానవుడికి అల్లాహ్ ఇచ్చిన భిక్ష. దాని కక్ష్యలో బందీగా కాకుండా బంధువుగా జీవిస్తే, నిత్యమూ ఆనందావరణంలో అమృత స్నానమే. మనసును పవిత్రం చేసుకుని, మన సృష్టికర్త ప్రేమను నింపుకోవాలి. అప్పుడు ప్రతిబంధకాలన్నీ తొలగిపోయి, నెమ్మదించిన మనసుగా, ప్రశాంత హృదయంగా మారి పోతుంది. అలా కాకుండా మనసును ప్రాపంచిక ప్రలోభాలు, తద్వారా కలిగే చికాకులతో నింపివేస్తే శిక్షగా మారి, కక్ష తీర్చుకుంటుంది.

## తల్లిదండ్రుల హక్కులు

ఇస్లాంలో దేవుని హక్కులు, దాసుల హక్కులని రెండు భాగాలు ఉన్నాయి. దాసుల హక్కులలో మొట్టమొదటి అంశం తల్లిదండ్రుల హక్కులే. కని పెంచి, విద్యాబుద్ధులు నేర్పిన తల్లిదండ్రుల హక్కులనే నెరవేర్చని మనిషి మనస్ఫూర్తిగా దేవుని హక్కులు నెరవేర్చగలడని ఏ మాత్రం ఆశించలేము.

ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి తనను జిహాద్‌లో పాల్గొనడానికి అనుమతించమని విన్నవించుకున్నాడు. దైవప్రవక్త(స) ఈ మాట విని "నీ తల్లిదండ్రులు జీవించి వున్నారా?" అని అడిగారు.

దానికి ఆ వ్యక్తి, ఉన్నారని చెప్పాడు. అప్పుడు దైవప్రవక్త (స) "అయితే నీవు వారిద్దరి సేవలోనే పరిశ్రమిస్తూ ఉండు" అని చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు : "బానిసత్వంలో మగ్గుతున్న తండ్రిని కొని అతనికి విముక్తి కలిగించితే తప్ప సంతానం అతని రుణం తీర్చుకోలేదు." (బుఖారీ)

దైవప్రవక్త (స) హితోక్తి : "తండ్రి స్వర్గద్వారాలన్నిటిలో ప్రధాన ద్వారం లాంటివాడు. నీ కిష్టమయితే ఆ ద్వారాన్ని నాశనం చేసుకో లేదా కాపాడుకో." (తిర్మిజీ)


తల్లిదండ్రులిద్దరిలోనూ తల్లి స్థానానికి ఓ ప్రత్యేకత ఉంది. పిల్లవాడి పుట్టుక, పోషణల విషయంలో తండ్రి శ్రమ-త్యాగాల కన్నా తల్లి శ్రమ-త్యాగాలే ఎక్కువగా ఉంటాయి. కనుక న్యాయం రీత్యా సంతానంపై తండ్రి హక్కుల కన్నా తల్లి హక్కులే అధికంగా ఉంటాయి.

హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం: ఒకతను దైవప్రవక్త(స)ను "నేను సేవ చేయడానికి నా తల్లిదండ్రులలో ఎవరెక్కువ హక్కుదారులు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త "నీ తల్లి" అని సమాధానమిచ్చారు. ఆ వ్యక్తి మళ్ళీ "ఆ తరువాత ఎవరు?" అని ప్రశ్నించాడు. దానికి కూడా దైవప్రవక్త (స) "నీ తల్లి" అనే సమాధానమిచ్చారు. ఆ వ్యక్తి తిరిగి "ఆ తరువాత ఎవరు?" అని అడిగాడు. దైవప్రవక్త (స) "నీ తల్లి" అనే జవాబిచ్చారు. అతను మళ్ళీ "ఆ తరువాత ఎవరు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీ తండ్రి" అని చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

ఒకతను దైవప్రవక్త(స)తో "నేను జిహాద్ చేయాలనుకుంటున్నాను" అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈ మాట విని "నీ తల్లిదండ్రులు ఉన్నారా?" అని అడిగారు. దానికా వ్యక్తి "నా తల్లి మాత్రమే బతికుంది" అన్నాడు. "అయితే నీ తల్లి పట్ల సత్ప్రవర్తన కలిగివుండు. నీవు నీ తల్లికి శక్తివంచన లేకుండా సేవ చేయగల్గితే జిహాద్ పుణ్యమే కాదు, హజ్-ఉమ్రాలు చేసినంత పుణ్యం కూడా లభిస్తుంది"అన్నారు దైవప్రవక్త(స)- (అబూయాలా- తబ్రాని)

ఒకతను వచ్చి "నేను జిహాద్లో పాల్గొనాలని అనుకుంటున్నాను. మీ సలహా ఏమిట"ని అడిగాడు. దానికి దైవప్రవక్త(స) "నీ తల్లి బ్రతికే ఉందా?" అని అడిగారు. ఆ వ్యక్తి "నా తల్లి బ్రతికే ఉంది" అన్నాడు. అప్పుడు దైవప్రవక్త(స) "అయితే నువ్వామెకు సేవ చేస్తూ ఉండు. ఆమె పాదాల క్రింద (నీ) స్వర్గం ఉంది" అని చెప్పారు. (నసాయి)

దైవప్రవక్త(స) ఒకసారి నాలుగు ఘోర పాపాలను గురించి ప్రస్తావించారు. అందులో మొట్టమొదటి ఘోరపాపం తల్లి పట్ల అవిధేయత చూపడమే. (బుఖారీ, ముస్లిం)




# దిశా నిర్దేశం చేస్తున్న దివ్య ఖుర్‌ఆన్

- తస్నీమ్ జహాన్ ఖాన్

**ఇస్లామ్** అనేది ఏ ఒక్కరి సొత్తూ కాదు. ఇది సర్వ మానవాళికై ఎన్నుకోబడిన ధర్మం. దీన్ని విశ్వసించిన ప్రతి ఒక్కరిపై దీన్ని వ్యాపింపజేసే బాధ్యత విధిగావించబడింది. అందువలన మనం తోటివారందరి వరకు ఇస్లాం సందేశాన్ని అందించాల్సి ఉంది. ఖుర్‌ఆన్ రెండు ప్రధాన కారణాలను ఈ విషయంలో మన ముందు ఉంచింది.

1) మొదటి కారణం ఏమిటంటే, సర్వ సృష్టికర్త అల్లాహ్ మొట్ట మొదటి మానవుడి దగ్గర నుండి ప్రళయం వరకూ పుట్టబోయే మానవులందర్నీ సమావేశపరిచి వారికి తెలివిని ప్రసాదించి వారందరి నుండీ తన దైవత్వం గురించిన ప్రమాణం తీసుకు న్నాడు.

2) రెండవ కారణం ఏమిటంటే, మానవుడిని అల్లాహ్ తన ప్రతినిధిగా చేసి ప్రపంచంలోనికి పంపించాడు. ఈ బాధ్యతను నిర్వర్తించేందుకు అతనికి ఆలోచించే, అర్థం చేసుకునే, నిర్ణయాలు తీసుకునే శక్తిని ప్రసాదించాడు. సమస్త భూవాసులను మనిషి సేవకై నియమించాడు. మనిషి తన భుజాలపై వేసుకున్న ఈ బాధ్యతను ఖుర్‌ఆన్ గుర్తు చేస్తూ ఉంటుంది. దీంతోపాటు నిన్ను సృష్టించిన సృష్టికర్త దాస్యాన్ని చేస్తూ ఉండమని ఖుర్‌ఆన్ పదేపదే అలారం మోగిస్తూనే ఉంటుంది.

“కనుక సమస్త ఏకాగ్ర చిత్తంతో మీ ముఖాన్ని ఈ ధర్మం దిశలో స్థిరంగా నిలపండి. అల్లాహ్ మానవులను ఏ స్వభావం ఆధారంగా సృష్టించాడో దానిపై స్థిరంగా ఉండండి. అల్లాహ్ సృజించిన స్వరూప స్వభావాలు మార్చటానికి శక్యం కానివి, ఇదే సవ్యమైన, తిన్నని ధర్మమార్గం, కాని చాలామందికి తెలియదు.” (30: 30)

అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: “జన్మించే ప్రతీ శిశువు సహజ స్వభావం పైనే జన్మిస్తాడు. అంటే ఏకదైవ స్వభావంపై జన్మిస్తాడు. తర్వాత అతని తల్లిదండ్రులు అతన్ని తమ ధర్మంపై మారుస్తారు”.

భారతీయ సమాజంలో దేవుడు ఒక్కడే అనే నమ్మకం గురించి పీయూ రీసెర్చ్ సెంటర్ 2020లో ఒక రిపోర్టును అందించింది. దీని ప్రకారం మన దేశంలో 97% జనాభా దేవుడు అనేవాడు ఒక్కడే అనే భావన కలిగి ఉన్నారు. 6% మంది అనేక దేవుళ్ళు ఉన్నారని నమ్ముతున్నారు. వీరిలో 54% మంది బహు దైవారాధన చేయడానికి కారణం వారంతా దైవ అవతారాలు అని నమ్మడమే అని తెలిపారు.

ఈ రిపోర్టు ద్వారా అర్థమైంది ఏమిటంటే ఖుర్‌ఆన్ సందేశం అన్నది మన సమాజంలో నమ్మకాలకు అనువైనదిగానే ఉంది. యా అయ్యుహన్నాస్, యా అయ్యుహల్ ఇన్సాను, యా బనీ ఆదము వంటి ఖుర్‌ఆన్ పిలుపులు సర్వమానవాళిని ఉద్దేశించి ఇవ్వబడ్డాయి. ఈ సందేశం ఇక్కడి సభ్యతా సంస్కృతిలో జీర్ణించుకునిపోయిన దేవుని ఏకత్వపు భావనను జాగృతం చేస్తున్నాయి. ప్రపంచంలోని వివిధ జాతుల వలెనే మన దేశవాసుల వరకు కూడా ఈ సందేశం చేర్చబడింది. “ప్రతి జాతి కొరకూ ఒక మార్గదర్శకుడు ఉన్నాడు.” (13: 7)

ప్రతి జాతి వద్దకు దైవప్రవక్తలను పంపినందువల్ల ప్రతి జాతికి దేవుని ఏకత్వం గురించిన జ్ఞానం ఉన్నది. వారికి రుజుమార్గం చూపేం దుకు, వారి నమ్మకాలను సరిచేసేందుకు ఏ జాతికి ఎలాంటి దృక్పథంలో హితబోధ చేయాలో అలా చేయబడింది.

అబూ రైహాన్ అల్ బేరూని (రహ్మ) పుస్తకం 'అల్ హింద్'లో ఇలా రాయబడి ఉంది : "అల్లాహ్ గురించి భారతదేశంలో ఆయన ఒక్కడే, ఆయనకు పుట్టుక లేదు చావులేదు, ఆయనకు ఎవరి అక్కర లేదు, ఆయన ప్రతి వస్తువుపై అధికారం కలిగి ఉన్నాడు, ఆయన వివేకవంతుడు, ఆయన సజీవంగా ఉన్నాడు. ఆయన బ్రతికించేవాడూను, ఆయన విజ్ఞాని, ఆయన నిత్యుడు. తన అధికారంలో ఎవరికీ భాగం లేని ఏకేశ్వరుడు, ఆయనను పోలిన వారు ఎవ్వరూ లేరు. ఆయనకు పోటీ ఎవ్వరూ లేరు'' అనే భావనను కలిగిన వారున్నారు.

మానవులకు ఖుర్ఆన్ సందేశం : భారతదేశ ప్రజలు ఏక దైవం అనే భావనను ఇప్పటికే తెలుసుకుని ఉన్నారు. మనిషిని ఇదే ప్రవృత్తిలో దైవం సృష్టించాడు. కాబట్టి దాన్నే అనుసరించాల్సిన అవసరం ఉంది. ఖుర్ఆన్ ప్రతీ మనిషి పేరున ఖచ్చితమైన, స్పష్టమైన సందేశాన్ని కలిగి ఉంది. ప్రపంచంలోకి మనిషిని ఎవరు పంపించారో ఆయనకు విధేయతను కలిగి ఉంటూ జీవనం గడపాల్సి ఉంది. తమ ప్రభువు ముందు చేసిన ప్రమాణాన్ని ఎన్నటికీ మరువకూడదు. తన పుట్టుక సమయంలో ఉన్న సహజ స్వభావాన్నే గిట్టే వరకూ అనుసరించాలి. ఖుర్ఆన్ ఇచ్చే ఈ సందేశం ప్రజల ఇహపరాలను జ్యోతిర్మయం చేస్తుంది. అందువల్లనే ఖుర్ఆన్ అనేక ఉదాహరణల ద్వారా తన సందేశాన్ని ప్రజలకు వివరిస్తుంది.

గతించిన జాతుల గాథలను పేర్కొని హితబోధ చేస్తుంది. వివిధ రకాల జంతుజాలాల ఉదాహరణలను ఇస్తుంది. మానవుని పుట్టుక, అతనిలో బాహ్యంగా, అంతర్గతంగా గల అనేక దైవ మహిమలను గుర్తుచేస్తూ ఉంటుంది. వర్షం కురవడాన్ని ఉదాహరణగా పేర్కొని హితబోధ చేస్తుంది. ఒక నిరక్షరాస్యుని నుండి ప్రపంచ మేధావి వరకు అందరికీ అర్థమయ్యే రీతిలో ఖుర్ఆన్ బోధనలు ఉన్నాయి. వీటన్నింటినీ పేర్కొనటానికి గల ఒకే ఒక్క కారణం, మనిషి తన నిజ ప్రభువును గుర్తించి ఆరాధించాలని మాత్రమే!

"మానవులారా! మిమ్మల్ని, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీనిద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది. మీ కొరకు భూమిని పాన్పుగాను, ఆకాశాన్ని కప్పుగాను సృష్టించినవాడూ, పైనుండి వర్షాన్ని కురిపించి, తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటు చేసి మీకు ఉపాధి కల్పించినవాడూ ఆయనే! ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి." (2: 21,22)
మన చుట్టూ గల పరిసరాలన్నీ తౌహీద్ గురించి గొంతు చించుకుని అరుస్తున్నాయి. వివిధ జాతుల్లో ప్రభవించిన దైవప్రవక్తలు వివిధ భాషల్లో బోధనలు గరిపి ఉన్నందువల్ల మనిషి తన ప్రభువును గుర్తించటం అనే విషయం సులువు అయినదో ఇది కూడా అలాంటిదే. వివిధ వస్తువులు, వాటి రంగులు, వాటి నిర్మాణం అన్నీ దైవభావనను దైవ గొప్పతనాన్ని గుర్తుచేస్తూ ఉంటాయి. అందువల్లనే ఖురాన్ మనిషిలోని సహజ స్వభావం ప్రకారమే సందేశాన్ని అందజేస్తుంది. ఉదాహరణకు, సూరె అన్ఆమ్‌లో 95-103 ఆయత్‌లు మనిషి సహజ స్వభావం, తర్కంను సంతృప్తిపరిచేలా చక్కగా వివరించబడి ఉన్నాయి. ఇంకా మచ్చుకు మరికొన్ని ఆయత్‌లను పరిశీలిద్దాం: "సూర్యుణ్ణి కాంతిమంతంగా చేసినవాడు ఆయనే. చంద్రుడికి వెలుగును ఇచ్చినవాడూ ఆయనే. చంద్రుని తరిగే పెరిగే దశలను కచ్చితంగా నిర్ణయించినవాడూ ఆయనే. తద్వారా మీరు సంవత్సరాలు, తేదీల లెక్కలను తెలుసుకోవాలని". (10:5)
"మీ కొరకు భూమిని నివాస స్థలంగా చేసినవాడూ, పైన ఆకాశాన్ని కప్పుగా నిర్మించినవాడూ, మీ రూపాన్ని తీర్చిదిద్దినవాడూ, దానిని ఎంతో చక్కగా మలచినవాడూ, మీ పరిశుభ్రమైన పదార్థాలను ఆహారంగా ఇచ్చినవాడూ అల్లాహ్‌యే కదా! ఆ అల్లాహ్‌యే మీ ప్రభువు. ఆ విశ్వప్రభువు అసంఖ్యాకమైన శుభాలు కలవాడు. ఆయనే సజీవుడు, ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు ఎవ్వడూ లేడు. ఆయననే మీరు వేడుకోండి...' (40: 64,65)
"భూమిలోనూ, ఆకాశాలలోనూ ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్ పవిత్రతను కొనియాడుతోంది. ఆయనే శక్తిమంతుడు, వివేకవంతుడూను.'' (57: 1)
ఖుర్ఆన్ బోధించే వివేకవంతమైన వాక్యాలను సందేశ ప్రచారంకై ఉపయోగించుకుని ప్రతి ఒక్కరు తమ తమ జాతి వారిని ఏక దైవారాధన వైపు పిలుపునిచ్చే ప్రయత్నం చెయ్యాలని ఖుర్ఆన్ దిశా నిర్దేశం చేస్తుంది.

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ఆడపిల్లలు ఉన్న ఇల్లే అందమైన ఇల్లు



హుమేరా అమీర్, ఏలూరు

**ఆడపిల్ల** వద్దు అనే జబ్బు కేవలం మగవారికి మాత్రమే కాదు చాలా మంది ఆడవారిలో కూడా ఉంది. తను స్వయంగా ఒక ఆడపిల్ల అయి ఉండీ, తనకు ఆడపిల్లలు వద్దు అనుకోవడం నిజంగా సిగ్గుతో తల వంచుకోవాల్సిన విషయం. ఎప్పుడైతే మనం ఆడపిల్లలు వద్దు అని అనుకుంటామో, అప్పుడే సమస్త మానవ జాతిని అంతమొందించడం కోసం దారులు తెరుస్తున్నామని అర్థం.

ఆడపిల్ల అనగానే సమాజంలో ఒక విధమైన చిన్నచూపు ఉంది. కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. ఆడపిల్లల విషయంలో పుట్టిన తరువాత అనేక ఆంక్షలు ఉంటాయి. వాటిని నిర్మూలించి ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టి సారించే దిశగా భారత ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్' పేరుతో ఒక కార్యక్రమం రూపొందించింది. అందులో భాగంగా 2008లో భారత ప్రభుత్వం, మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రారంభించింది. బాలురతో పోల్చితే నేడు బాలికలకు సమానత్వం లేకపోవడం గురించి సమాజంలో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో, "జాతీయ బాలికా దినోత్సవాన్ని" ప్రతి సంవత్సరం జనవరి 24న భారతదేశం అంతటా జరుపుకుంటారు.

1966 జనవరి 24న ఇందిరాగాంధీ భారత తొలి మహిళా ప్రధాన మంత్రిగా నియమితులైనందున జనవరి 24వ తేదీని జాతీయ బాలికా దినోత్సవంగా ఎంచుకున్నారు.

భారతీయ సమాజంలో బాలికలు ఎదుర్కొనే అసమానతల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, లింగ ఆధారిత పక్షపాతాలను తొలగించడం, ఆడపిల్లల హక్కుల గురించి అవగాహన కల్పించడం, ఆడపిల్లలను రక్షించడం, స్త్రీ విద్య, ఆరోగ్యం, పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి, పిల్లల లింగ నిష్పత్తిలో ఆడపిల్లల పెరుగుదల, బాలికలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని సృష్టించడం గురించిన వ్యవస్థీకృత కార్యక్రమాలతో ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు.

ఒకప్పుడు భారతదేశంలో బాల్య వివాహాల సమస్య తీవ్రంగా ఉండేది. కుటుంబాల మధ్య సంబంధ బాంధవ్యాలను పటిష్ఠ పరచుకోవడానికి ఆడపిల్ల పుట్టగానే తమ బంధువర్గంలో ఫలానా వాడికి భార్య పుట్టిందని ఇరువర్గాల వారు నిర్ణయించేసుకొని పిల్లలు కొంచెం పెద్దవారవ్వగానే వివాహం చేసేవారు. ఒక్కోసారి కుటుంబాలలోని వృద్ధుల కోరిక మేరకు వారు చనిపోయేలోపు తమ వారసుల పెళ్ళిళ్ళు చూడాలనే కోరికను తీర్చడానికి కూడా బాల్య వివాహాలు జరిపించేవారు. మరికొన్ని కుటుంబాల్లో పిల్లలు యుక్తవయసు (Teenage)కు వచ్చిన తర్వాత వక్రమార్గాల్లో ప్రయాణిస్తారనే భావనతో ముందు జాగ్రత్తగా బాల్యవివాహాలు జరిపించేవారు. ఈ బాల్యవివాహాల వల్ల పిల్లలకు యుక్తవయసు వచ్చిన తర్వాత ఒకరిపై ఒకరు ఇష్టం ఉన్నా లేకపోయినా కలిసి జీవితం గడపాల్సివచ్చేది.

కొన్నిసార్లు చిన్నపిల్లకు తనకంటే వయసులో ఎక్కువ తేడా ఉన్న వ్యక్తితో వివాహం జరిపించడం వల్ల అమ్మాయి యుక్తవయసు వచ్చేసరికి, ఆమె భర్త చనిపోయేవాడు. అంతేకాదు ఆడపిల్లల పునర్వివాహం సామాజిక నేరంగా పరిగణించేవారు. అందువల్ల బాలికా వితంతువుల సమస్య కూడా ఎక్కువగానే ఉండేది.

ఇప్పుడైతే ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజెస్ యాక్ట్ 2006 ప్రకారం ఆడపిల్లకు 18 సంవత్సరాలు, మగపిల్లవాడికి 21 సంవత్సరాలు నిండనిదే వారికి వివాహం చేయడం నిషిద్ధం.

విద్యను అభ్యసించిన బాలికలు ఆరోగ్యవంతమైన, సంతృప్తికర మైన జీవితాన్ని గడపడానికి ఎక్కువ అవకాశం ఉంది. స్త్రీ అక్షరాస్యతపై సమాజంలో అవగాహన కల్పించడం వల్ల, బాలిక లలో విద్యా ప్రమాణాలు పెంచడం సాధ్యమవుతుంది. తద్వారా బాలికలకు చిన్న వయసులోనే వివాహం చేసే అవకాశాలు తగ్గుముఖం పడతాయి. బాలికలు విద్యాధికులు అవ్వడం వల్ల వారి భవిష్యత్తు మాత్రమే కాదు వారి కుటుంబానికి, సమాజానికి తర్వాత దేశానికీ మెరుగైన భవిష్యత్తును అందించగలుగుతారు.

2010 నుండి, భారతదేశంలో మహిళా అక్షరాస్యత రేటు కొంచెం మెరుగ్గానే ఉంది. 2010లో స్త్రీల అక్షరాస్యత రేటు 80.35%. కాలక్రమేణా, 2010-2021 మధ్య, భారతదేశంలో స్త్రీల అక్షరాస్యత రేటు 14.4% పెరిగింది. అయితే భారతదేశంలో నేటికీ బాలురతో పోలిస్తే బాలికలలో అక్షరాస్యతా శాతం తక్కువగానే ఉంది.

యునెస్కో అంచనాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 129 మిలియన్ల మంది బాలికలు పాఠశాలలకు దూరంగా ఉన్నారు. ఇందులో 32 మిలియన్ల మంది బాలికలు ప్రాథమిక పాఠశాల వయస్సు వారు ఉండగా, 30 మిలియన్ల మంది సెకండరీ పాఠశాల వయస్సువారు, 67 మిలియన్ల మంది ఉన్నత పాఠశాల వయస్సు వారు ఉన్నారు.

ఆహారం, ఆరోగ్యం విషయంలో కూడా ఆడపిల్లలపై వివక్ష కనిపిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బాలికలలో పోషకాహార లోపం, రక్తహీనత మరియు విటమిన్-ఎ లోపం వంటి సమస్యలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి.

మహిళలు వివిధ రంగాలలో పురోగతి సాధించినప్పటికీ, మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు వివిధ స్థాయిలలో ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, సమాజంలోని పురుషాధిక్య ధోరణిని ప్రోత్సహించే వ్యక్తుల ఆలోచనలు ముందుగా మారాలి. ఆడపిల్లల విద్య కంటే మగపిల్లల విద్యకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే వ్యక్తులు, కుటుంబాలు మన చుట్టూ సమాజంలో మనకు కనిపిస్తూనే ఉన్నాయి. అంతేకాదు కేవలం ఇంటి పనులు చేయడం కోసం ఆడపిల్లలను చదువు మాన్పించే మనస్తత్వాలు కూడా మారాలి.

దైవం దృష్టిలో ఆడ, మగ ఇద్దరికీ సమానమైన ప్రాధాన్యం ఉంది. ఇద్దరికీ సమానమైన హక్కులు కూడా ఇవ్వడం జరిగింది. మనుషులు కల్పించుకునే పక్షపాత ధోరణి దైవాదేశాలకు విరుద్ధమైనది అనే విషయాన్ని మనం గమనించాలి. బాలికల హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో జాతీయ బాలికల దినోత్సవం చాలా ముఖ్యమైనది. పక్షపాతం లేని ప్రపంచాన్ని సృష్టించి, నాణ్యమైన విద్యను, కెరీర్ ఆధారిత విద్యాపరమైన అవకాశాలు కల్పించి, బాలికలను అన్ని రంగాలలో నిపుణులుగా మార్చడం, తద్వారా ఆడపిల్లల భవిష్యత్తును, దేశ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడం మన అందరి చేతుల్లోనే ఉంది.

# నిజం...నిజం...

**షేక్ మహబూబ్ జానీ, ఆకివీడు**

**నిజం** నిప్పులాంటిది,
నిజం చేదుగా ఉంటుంది,
నిజం నిలకడ మీద ఉంటుంది,
నిజం ఉన్నచోట అబద్ధానికి తావు ఉండదు,
నిజం ఎన్నటికీ ఓడిపోదు,
నిజం వెలుగునిస్తుంది...

ఇన్ని సార్లు నిజం నిజం అని ఎందుకు అంటున్నానంటే నేను చెప్పబోయే విషయం నిజం కనుక.

కొంత మందికి రుచించదు. కానీ ఒకసారి మనం ప్రశాంతమైన మనసుతో ఆలోచిస్తే మీకే అర్థమవుతుంది. నేడు మనదేశంలో నీళ్లకైనా కరువు ఉందేమో గాని సారాయి, మద్యానికి కొదువ లేదు. ఎక్కడపడితే అక్కడ మద్యం ఏరులై పారుతుంది. పట్టణాల నుండి మారుమూల ప్రాంతాల వరకు ఎక్కడ చూసినా మద్యం మనకు కనబడుతుంది. ఆడ మగ అనే భేదం లేకుండా అందరూ తాగేస్తున్నారు. కుల మతాలకు అతీతంగా అమ్ముడైపోతుంది. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు ఇలా ఒక మతం ఏమిటి.. కులం ఏమిటి... అందరూ మద్యం సేవిస్తున్నారు. మద్యం తాగిన వ్యక్తి విచక్షణ జ్ఞానాన్ని కోల్పోతాడు. పశు లక్షణాలు అతనిలో కానవస్తాయి. తన మన అనే తేడా లేకుండా తారతమ్యం లేకుండా వింత పశువులా ప్రవర్తిస్తాడు. తన భార్య ఎవరో, తల్లి ఎవరో, కూతురు ఎవరో అనే విచక్షణ జ్ఞానాన్ని కోల్పోతాడు. తన చేతికి అందిన వస్తువును విరగ్గొడతాడు. తన చేతికందిన కత్తులతో చంపగలడు. ఇదంతా నిజమా కాదా... ఒకసారి ఆలోచించండి....

ముస్లింలు పంది మాంసాన్ని అసహ్యించుకుంటారు. పంది అశుద్ధాన్ని తింటుంది. బురదలో దొర్లుతుంది. అందుకే పంది మీద మనకు అసహ్యమేస్తుంది. పందికి, మద్యానికి సంబంధం ఉంది. మద్యం తాగిన వ్యక్తి ఎక్కడ పడుకుంటాడో తనకే తెలియని స్థితిలో ఉంటాడు. మద్యం మత్తులో పడి ఆరోగ్యాన్ని, భార్య పిల్లల భవిష్యత్తునీ నాశనం చేసుకుంటాడు.

ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా మద్యం అనే మత్తుకి దూరంగా ఉండాలి.

మద్యపాన నిషేధం ప్రభుత్వాల వల్ల సాధ్యం కాదు. ఎందుకంటే మద్యం ద్వారా ఎక్కువ ఆదాయం వచ్చినప్పుడు ఏ ప్రభుత్వం కూడా ఎలా వదులుకొంటుంది.

ఇప్పటికైనా మేల్కొండి.. మద్యపానాన్ని జీవితాల్లో నిషేధించుకుందాం.



# ఖుర్ఆన్ పట్ల మక్కువ

- ముహమ్మద్ గౌస్‌ఖాన్

**దివ్య ఖుర్ఆన్** పట్ల ప్రవక్త(స) అనుచరులకు ఎంతో మక్కువ ఉండేది. దివ్య ఖుర్ఆన్‌ను పఠించేవారు కొందరైతే, దానిని కంఠస్తం చేసినవారు మరికొందరు. దైవగ్రంథం ఖుర్ఆన్ అంటే వారికి ప్రాణం.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) దివ్య ఖుర్ఆన్‌ను చదవడం ప్రారంభిస్తే, తాను చదవాలనుకున్నది పూర్తి అయ్యేంత వరకు ఎవరితోనూ మాట్లాడేవారు కాదు.

కొందరు దుండగులు హజ్రత్ ఉస్మాన్(రజి) ఇంటిపై రాళ్లు రువ్వుతున్న సమయంలో ఆయన పవిత్ర ఖుర్ఆన్ పఠనంలో నిమగ్నమై ఉన్నారు. అలాగే, పవిత్ర దివ్య గ్రంథాన్ని చదువుతున్న సమయంలోనే ఆయన అమరగతి పొందారు. ఆ సమయంలో పవిత్రమైన ఆయన రక్తపు చుక్కలు కూడా ఆ పవిత్ర గ్రంథంపై పడ్డాయి.

పవిత్ర ఖుర్ఆన్‌ను కంఠస్థం చేసిన సహచరులు ఎందరో ఉన్నారు. వారిలో దాదాపు డెబ్బై మంది "హాఫిజే ఖుర్ఆన్"లు యమామాలో బనూ హనఫియా తెగ, ముస్లింలకు మధ్య జరిగిన యుద్ధంలో అమరులయ్యారు.

హజ్రత్ ఉమర్(రజి)కు, ఖుర్ఆన్ పట్ల ఇస్లాం పట్ల గల అపోహలు అపార్థాలను దూరం చేసి ఆయన్ను ముస్లిం (విశ్వాసి)గా మార్చింది దివ్య ఖుర్ఆన్‌లోని వాక్యాలే.

ప్రవక్త ముహమ్మద్(స) ఇస్లాం సందేశాన్ని హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి)కు పంపించారు. ఆ సందేశాన్ని విన్న ఆయన, దివ్య ఖుర్ఆన్ పరిశోధన కోసం తన సోదరుడిని మక్కాకు పంపించారు. సోదరుడు మక్కా నుండి తిరిగి వచ్చి దివ్య ఖుర్ఆన్ వాస్తవాలను తెలియ జేశాడు. అది విన్న హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ(రజి) మక్కా చేరుకుని ప్రవక్త (స) సమక్షంలో ఇస్లాం ధర్మంలో చేరారు.

"న్యాయం చెయ్యండి అనీ, ఉపకారం చెయ్యండి అనీ, బంధువుల హక్కులు నెరవేర్చండి అనీ అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు". (16:90) అనే వాక్యాలు నా చెవిలో పడ్డప్పుడు వెంటనే నా హృదయం విశ్వాసంతో నిండుకుంది. అప్పటి నుండే నేను ప్రవక్త(స)ను ప్రేమించడం ప్రారంభించాను అని హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్ఊన్(రజి) తెలిపారు.

హజ్రత్ తుఫైల్ బిన్ అమ్ర్ వల్దూసి (రజి), ప్రవక్త (స) నోట దివ్య ఖుర్ఆన్ వాక్యాలు విని వెంటనే ముస్లిం అయ్యారు.

ఖాలిద్ అల్-అదూనీ, ప్రవక్త(స) నోట "అత్ తారిఖ్" అధ్యాయం లోని కొన్ని వాక్యాలు విన్న వెంటనే ఆ అధ్యాయాన్ని పూర్తిగా కంఠస్థం చేశారు. ఆ తర్వాత ముస్లిం అయ్యారు.

అనేక మంది అనుచరులు రాత్రింబవళ్లు ఖుర్ఆన్ నేర్చుకోవ డంలో, ఇతరులకు నేర్పించడంలో నిమగ్నమై ఉండేవారు. దివ్య ఖుర్ఆన్ విద్యను నేర్చుకోవడానికి అనేక తెగల నుండి ప్రతినిధులు మదీనాకు వచ్చేవారు. అలాగే, మదీనా నుండి ఇతర ప్రాంతాలలో దివ్య ఖుర్ఆన్ విద్యను నేర్పించడానికి చాలా మంది అనుచరులు వెళ్లేవారు. దైవప్రవక్త(స), హజ్రత్ ముఆజ్

బిన్ జబల్(రజి)ను యమన్‌కు పంపేటప్పుడు, అక్కడి ప్రజలకు పవిత్ర ఖుర్‌ఆన్ గురించి, ఇస్లాం నియమాల గురించి బోధించమని ప్రత్యేకంగా చెప్పారు.

హజ్రత్ ఉమర్ (రజి), తన ఖిలాఫత్ కాలంలో ఖుర్‌ఆన్ బోధనలను చాలా విస్తృత పరిచారు. ఖుర్‌ఆన్ బోధనల కోసం ఇస్లామియా రాజ్యాలలో ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేయించి, సుదూర ప్రాంతాలలో బోధించడానికి అనేక మంది ప్రవక్త అనుచరులను కూడా నియమించారు. "అల్ బఖరా, అన్ నిసా, అల్ మాయిదా, అల్-హజ్, అన్-నూర్ అధ్యాయాలలో నియమాలు, విధులు ప్రస్తావించబడ్డాయి. అందువలన వాటిని నేర్చుకోవడం ముస్లింలకు తప్పనిసరి" అని హజ్రత్ ఉమర్ (రజి) చెప్పేవారు. ఖుర్‌ఆన్ ఉచ్ఛరణపై శ్రద్ధ వహించాలని, పదజాలంలో నైపుణ్యం లేని వ్యక్తులు పవిత్ర ఖుర్‌ఆన్‌ను బోధించకూడదని, తమ ప్రతినిధులను కోరేవారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) పాలన కాలంలో, అజర్ బైజాన్ ఇస్లామీయ షరియత్ ఆధీనంలోకి వచ్చిన తర్వాత ఖుర్‌ఆన్ బోధనల కోసం అక్కడ కొంతమంది సహచరులను నియమించడం జరిగింది. హజ్రత్ అలీ(రజి), పవిత్ర ఖుర్‌ఆన్ చదివే విద్యార్థుల కోసం స్టైఫండ్‌ని కూడా నిర్ణయించారు.

ప్రవక్త(స) అనుచరులు ఖుర్‌ఆన్ భావాన్ని పూర్తిగా అర్థం చేసుకొని దానిపై నడిచే ప్రయత్నం చేసేవారు. తమకు అర్థం కాని విషయాలను, ఒకరినొకరు అడిగి తెలుసుకునేవారు. మరికొన్ని సందర్భాలలో, స్వయంగా ప్రవక్త (స) గారినే అడిగేవారు. ప్రవక్త (స) కూడా, తన అనుచరులకు ఖురాన్ బోధనలు ఎంతవరకు అర్థమయ్యాయో అడిగి తెలుసుకునేవారు.

ప్రవక్త అనుచరులు ఖుర్‌ఆన్ ఆదేశాలను విన్నప్పుడు, వాటిని వెంటనే అమలుపరిచేవారు. మద్యపానం నిషిద్ధమని తెలిసిన వెంటనే తమ ఇండ్లలోని మద్యం పాత్రలను పగలగొట్టారు. బంగారం, వెండిని అధికంగా కూడబెట్టిన వారికోసం శిక్ష ఉందని తెలిసిన వెంటనే హజ్రత్ మాలిక్ (రజి), తన వద్ద ఉన్నదంతా దానం చేశారు. తమకు ఇష్టమైన వస్తువులను అల్లాహ్ మార్గంలో ఖర్చు చెయ్యండని ఆజ్ఞ అయినప్పుడు, హజ్రత్ తల్హా (రజి), కొంత మంది సహచరులు తమ ఖరీదైన భూములను తెచ్చి ప్రవక్త (స) సేవలో సమర్పించారు.

ఖుర్‌ఆన్ అవతరణకు ముందు, అరబ్‌లోని అగ్రశ్రేణి కవులలో హజ్రత్ లుబైద్ (రజి) ఒకరు. కాని, ఖుర్‌ఆన్ అవతరణ ప్రారంభమైన తర్వాత ఆయన ఖుర్‌ఆన్‌ను మాత్రమే చదివి కవిత్వాన్ని చదవడం శాశ్వతంగా విడిచిపెట్టాడు. "ఖుర్‌ఆన్ అవతరణ తర్వాత నేను కవిత్వం చెప్పడం పూర్తిగా మర్చిపోయాను" అని హజ్రత్ లుబైద్ (రజి) స్వయంగా అన్నారు.

సహాబా గొప్ప లక్షణం ఏమిటంటే, వారు తమ వాదనలు, ఆలోచనలను పక్కన పెట్టి ఖుర్‌ఆన్‌ను అనుసరించేవారు. ప్రవక్త (స) మరణాన్ని, హజ్రత్ ఉమర్ (రజి) జీర్ణించుకోలేకపోయారు. "ఎవరైనా ఆయన(స) మరణించారని చెబితే, నేను అతని తలను ఖండిస్తాను" అని హజ్రత్ ఉమర్ (రజి) కత్తి చేత పట్టినప్పుడు, హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ (రజి)- "ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కారు. ఆయనకు పూర్వం ఇంకా ఎందరో ప్రవక్తలు గతించారు" (3:144) అని, ఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యాన్ని గుర్తు చేశారు. అది విన్న వెంటనే హజ్రత్ ఉమర్ (రజి) ఆలోచన మారిపోయి చేత బట్టిన కత్తిని క్రింద పడేశారు.


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




## ఇదెక్కడి న్యాయం?

జెఎన్‌యు స్టూడెంట్స్ యూనియన్ మాజీ ఉపాధ్యక్షురాలు షెహ్లా రషీద్ షోరాను విచారించేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతించారు. 2019లో భారత్ ఆర్మీపై ఆమె చేసిన వ్యాఖ్యలపై స్థానిక స్పెషల్ సెల్ పోలీస్‌స్టేషన్‌లో ఐపిసి సెక్షన్ 153 కింద కేసు నమోదైందని ఎల్‌జి కార్యాలయంలోని ఓ అధికారి తెలిపారు. అలోక్ శ్రీవాస్తవ ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదైందని అన్నారు. ఈ కేసు విచారణ నిమిత్తం ఢిల్లీ పోలీసులు అనుమతి కోరారని, ఢిల్లీ హోం శాఖ మద్దతునిచ్చిందని ఆ అధికారి తెలిపారు. కశ్మీర్‌లో ఆర్మీ స్థానికుల నివాసాల్లోకి ప్రవేశించి.. వారిని హింసిస్తోందని ఆగస్ట్ 18, 2019లో షోరా ట్వీట్ చేశారు. ఈ ఆరోపణలు నిరాధారమైనవంటూ ఆర్మీ తోసిపుచ్చింది. అయితే విద్వేషాలు రెచ్చగొట్టే నేతలను వదలిపెట్టి విద్యార్థులను విచారించడం ఎక్కడి సమానత్వం అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## మత మార్పిడులు తీవ్ర సమస్య

మత మార్పిడుల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మత మార్పిడులు అనేది తీవ్రమైన సమస్య అని, దానికి రాజకీయ రంగు అంటించొద్దని వ్యాఖ్యానించింది. మోసపూరిత మత మార్పిడులను నియంత్రించేందుకు కేంద్రం, రాష్ట్రాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అడ్వకేట్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పటిషన్‌పై సుప్రీంకోర్టు జస్టిస్ ఎంఆర్ షా, సిటీ రవికుమార్‌లతో కూడిన బెంచ్ విచారణ చేపట్టింది. బెదిరింపులు, మోసపూరితంగా బహుమతులు, నగదు ఆశ చూపడం ద్వారా మత మార్పిడులకు చెక్ పెట్టాలని పిటిషన్‌లో సహాయం చేయాలని అటార్నీ జనరల్ వెంకట రమణని బెంచ్ కోరింది. మత మార్పిడులు బలవంతంగా, ఎలాంటి ఆకర్షణల ద్వారా ఏ ఏ మార్గాల్లో జరుగుతున్నాయని ప్రశ్నించింది. అంతే కాకుండా ఒకవేళ నిజంగా జరిగితే ఎప్పుడు జరిగాయనే విషయాన్ని చెప్పాలని, దానిని సరిదిద్దే అంశాలు ఏమైనా ఉంటే చెప్పాలని ఏజీని కోరింది.

## పునరావాసం కల్పించిన తరువాత ఖాళీ చేయించండి

పునరావాసం కల్పించే వరకూ ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో నివాసముంటున్న సుమారు 50వేల మందిని రాత్రికి రాత్రి ఖాళీ చేయించొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. రైల్వే స్థలాల్లోని నిర్మాణాలను వారం రోజుల్లో తొలగించాలని, ఆ ప్రక్రియ ఈ నెల 10 నుంచి ప్రారంభించాలని ఉత్తరాఖండ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను నిలిపివేసింది. "ఈ కేసు మానవీయ కోణంతో ముడిపడి ఉంది. 1947 తరువాత కొంతమంది ఈ స్థలాన్ని వేలంలో దక్కించుకుని అక్కడ నివాసం ఏర్పరుచుకున్నారు. 60-70 ఏళ్ల నుంచి అక్కడ ఉంటున్నవారిని ఖాళీ చేయించే పద్ధతి ఇది కాదు. ఇలాంటి ఉత్తర్వులను ప్రోత్సహించబోం. వారికి తప్పనిసరిగా పునరావాసం కల్పించాలి. భూమిపై ఎలాంటి హక్కులు లేనివారికి కూడా పునరావాసం కల్పించి ఖాళీ చేయించిన సందర్భాలున్నాయి. బాధితులను దృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించాలి అని ఆదేశించింది.

## భారత్ 'హజ్' కోటా పెంపు

భారతదేశం నుంచి హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికుల సంఖ్యను సౌదీ అరేబియా ప్రభుత్వం భారీగా పెంచింది. ఈ ఏడాది భారత్ నుంచి 1,75,025 మందిని హజ్ యాత్రకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందంపై సౌదీ అరేబియా హజ్ వ్యవహారాల సహాయ మంత్రి అబ్దుల్ ఫత్తాహ్, భారతీయ కాన్సులేట్ జనరల్ ముహమ్మద్ ఆలం సంతకాలు చేశారు.

## రాజ్యాంగ విలువలు నిర్వీర్యం

దేశంలో మతోన్మాద హిందూ శక్తులు అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లలో ఫెడరలిజంతో సహా రాజ్యాంగ ప్రాథమిక విలువలు నిర్వీర్యం చేశారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ విమర్శించారు. ఫాసిస్ట్ హిందూ రాజ్యాన్ని సృష్టించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. సెక్యులర్ డెమోక్రటిక్ రిపబ్లిక్ భావనకు తీవ్ర ముప్పు పొంచి ఉందని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన "రాజ్యాంగం పరిరక్షణ - ప్రజాస్వామ్యం పరిరక్షణ" జాతీయ సదస్సును ప్రారంభించిన సందర్భంగా జస్టిస్ గోపాలగౌడ పై వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.... మతపరమైన మైనారిటీలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులు కూడా భయంతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, కోవిడ్ కాలంలో దేశంలో డాలర్ మిలియనీర్ల సంఖ్య బాగా పెరిగిందని తెలిపారు. గవర్నర్లు కేంద్రం చేతిలో సాధనాలుగా మారారని, ఫెడరలిజాన్ని తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. కొలీజియం వ్యవస్థను నాశనం చేయడమే కేంద్రం ప్రయత్నమని అన్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా లేదని, దేశంలో స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలను చూడలేమని జస్టిస్ గౌడ అన్నారు. ఇటీవల జరిగిన గుజరాత్, యుపి, బీహార్ ఎన్నికలు తటస్థంగా ఉన్నాయని చెప్పలేమన్నారు. ఎన్నికల కమిషన్, సిబిఐతో సహా అన్ని రాజ్యాంగ సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి సాధనాలుగా మారాయని విమర్శించారు.




## బ్రెజిల్‌లో విధ్వంసం..

బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జెయిర్ బోల్సొనారో మద్దతుదారులు ఆ దేశంలో పలుచోట్ల విధ్వంసం సృష్టించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమ నేత బోల్సొనారో ఓటమిని జీర్ణించుకోలేని వేలాది మంది ఒక్కసారిగా దేశంలోని అతి ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలైన అధ్యక్ష భవనం, సుప్రీంకోర్టు, కాంగ్రెస్ భవనాలలోకి చొరబడ్డారు. సెక్యూరిటీ వలయాలను ఛేదించి, బారికేడ్లను తొలగించిన ఆందోళనకారులు పెద్దయెత్తున ఈ భవనాల్లోకి ప్రవేశించారు. భవనాల పైకప్పుల పైకి సైతం ఎక్కిన ఆందోళనకారులు విధ్వంసానికి పాల్పడ్డారు. కిటికీలు, తలుపులతో పాటు లోపల ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. అధ్యక్షుడిగా లూయిజ్ ఇనాసియో లులా డసిల్వా ప్రమాణస్వీకారం చేసిన వారం తర్వాత ఈ విధ్వంసకర సంఘటన చోటుచేసుకుంది.

## కోర్టులో వాదించనున్న రోబో

ప్రపంచంలోనే మొట్టమొదటి రోబో లాయర్‌ను అమెరికాకు చెందిన 'డునాట్‌పే' సంస్థ అభివృద్ధి చేసింది. మనిషి పక్షాన ఇది కోర్టులో కేసు వాదించనుంది. లాయర్లకు ప్రత్యామ్నాయంగా కృత్రిమ మేధ ఆధారంగా ఒక బోట్‌ను ఈ సంస్థ రూపొందించింది. వచ్చే నెల అమెరికాలోని ఓ కోర్టులో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన కేసులో ఇది వాదనలు వినిపించబోతున్నది. అయితే, ప్రత్యక్షంగా ఎలాంటి రోబో ఉండదు. కోర్టుకు హాజరు కాదు. కోర్టుకు హాజరయ్యే ప్రతివాది తన సెల్‌ఫోన్‌లో ఈ యాప్ వేసుకోవడంతో పాటు, ఇయర్‌ఫోన్స్ పెట్టుకోవాలి. కోర్టులో వాదనలను ఈ ఏఐ బోట్ విని ఎలా వాదించాలి, ఏ పాయింట్‌ను లేవనెత్తాలి వంటి సూచనలను కోర్టులో ఉన్న ప్రతివాదికి ఎప్పటికప్పుడు అందిస్తుంది.

## ఫ్రాన్స్‌ను హెచ్చరించిన ఈరాన్...

ఈరాన్ అధినేత ఆయతుల్లా అలీ ఖుమేనీపై ఫ్రాన్స్‌లోని హాస్య వార పత్రిక చార్లీ హెబ్డో ప్రచురించిన వ్యంగ్య కార్టూన్లపై ఈరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అవమానకరంగా, అమర్యాదకరంగా ఉన్న కార్టూన్లను ప్రచురించినందుకు నిశ్చయాత్మకమైన, దీటైన సమాధానం తప్పదని ఫ్రాన్స్‌ను హెచ్చరించింది.

## మస్జిదె నబవీ లైబ్రరీలో అంధుల కోసం బ్రెయిలీ లిపిలో ఖుర్‌ఆన్

మస్జిదె నబవీ లైబ్రరీలో అంధుల కోసం బ్రెయిలీ లిపిలో ఖుర్‌ఆన్ ప్రతులను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు మస్జిదె నబవీ వ్యవహారాల సంస్థ వెల్లడించింది. కొన్ని ప్రత్యేక ప్రాంతాలలో, లిఫ్టలలోనూ బ్రెయిలీ విధానం తీసుకువచ్చినట్లు వివరించింది. అంధులకు బ్రెయిలీ లిపిలో ఖుర్‌ఆన్ చదవడం, దానిని అర్థం చేసుకోవడంలో ఎంతో ఉపయుక్తం అవుతాయని పేర్కొంది. బ్రెయిలీ లిపిలోని నిర్దేశిత అక్షరాలు కదిలే అక్షరాలుగా రూపాంతరం చెందుతాయి. అంధులు దీని ద్వారా చాలా సులభంగా ఆయత్‌లు పఠించగలగుతారు. పేజీలను, అధ్యయనాలను సరళంగా తెలుసుకోగలగుతారని తెలిపింది.

## విశ్వాస పరీక్షలో నెగ్గిన ప్రచండ

నేపాల్ నూతన ప్రధానమంత్రిగా నియమితులైన పుష్ప కమల్ దహల్ 'ప్రచండ' ప్రతినిధుల సభలో జరిగిన విశ్వాస పరీక్షలో నెగ్గారు. విశ్వాస పరీక్ష సందర్భంగా హౌస్ ఆఫ్ రెప్రజెంటేటీవ్స్ (హెచ్‌ఒఆర్)లో హాజరైన 270 మంది సభ్యుల్లో 268 మంది ప్రచండకు అనుకూలంగా ఓటు వేశారు. కేవలం ఇద్దరు మాత్రమే ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేశారు.

## జూన్ నెల నుంచి హజ్ యాత్ర ప్రారంభం

హజ్ యాత్ర 2023, జూన్ 26 నుంచి ప్రారంభమవనున్నది. కరోనా సమయంలో హజ్ యాత్రపై విధించిన ఆంక్షలను ఈ యేడు సౌదీ అరేబియా తొలగించింది. కోవిడ్ వ్యాప్తి నివారణలో భాగంగా సౌదీ అరేబియా హజ్ యాత్రపై ఈ ఆంక్షలను విధించింది. 2020లో కరోనా కారణంగా చాలాకొద్ది మంది మాత్రమే హజ్ చేయగలిగారు. కరోనా వ్యాప్తి కారణంగా 20-50 సంవత్సరాల మధ్య ఉన్నవారు మాత్రమే హజ్ చేశారు. కాగా, 2021లో కొన్ని పరిమితులతో 60 వేల మందిని హజ్ చేయడానికి అనుమతించారు. వీరంతా సౌదీ పౌరులే. కోవిడ్ వ్యాక్సిన్ రెండు డోసులు తీసుకున్న అంతర్జాతీయ యాత్రికులు హజ్ చేసేందుకు 2022లో అనుమతించారు. అయితే ఈ యేడు కరోనా ఆంక్షలన్నిటినీ తొలగించినట్లు హజ్ శాఖ వెల్లడించింది. హజ్ యాత్ర దరఖాస్తులను ఫిబ్రవరి 15 వరకు దాఖలు చేయవచ్చని తెలిపింది. దీని కోసం ప్రయాణికులు జూలై మధ్య వరకు చెల్లుబాటయ్యే నివాస గుర్తింపు కార్డును కలిగి ఉండాలి. దాంతో పాటు కరోనా, సీజనల్ ఇన్‌ఫ్లుయెంజా టీకా తీసుకున్నట్లు సర్టిఫికేట్ కలిగి ఉండాలి. హజ్ మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ ద్వారా కూడా డైరెక్టుగా దరఖాస్తు చేసుకోవచ్చు. హజ్ ప్యాకేజీ మొత్తాన్ని మూడు విడతల్లో చెల్లించే వెసులుబాటు కల్పించారు. సీటును రిజర్వ్ చేసుకునేందుకు 20 శాతం డిపాజిట్ చెల్లించాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న 72 గంటల్లోగా డౌన్‌పేమెంట్ చేయాలి. మిగతా మొత్తాన్ని రెండు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది.

# యువతకు వారధి ఐవైఎం




**జమాఅతె ఇస్లామీ హింద్** ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008వ సంవత్సరంలో ఏర్పడిన ఆదర్శ యువత ఉద్యమమే ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ (ఐవైఎం). ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం అప్పటి అమీరె హల్ఖా మౌలానా అబ్దుస్సలామ్ దస్తగీర్ గారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఏర్పడిన ఐవైఎంకు విశాఖపట్నం వాస్తవ్యులు షేక్ సిరాజ్ 2021 వరకు నేతృత్వం వహించారు. అల్హందులిల్లాహ్ ఈ ఏడు సంవత్సరాల కాల వ్యవధిలో ఐవైఎం ఎన్నో కార్యక్రమాల ద్వారా ముస్లిం యువతకు చేరువ అయ్యింది. ఈ తరుణంలో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఐవైఎం తన శాఖలను ఏర్పాటు చేసుకొని చేతి వృత్తులు, వ్యాపారాలు చేసుకోనే ముస్లిం యువతలో నైతికత, ఇస్లామీయ ఆరాధన రీతులు, సమాజం పట్ల బాధ్యత పునాదులుగా వారిలో ఇస్లామీయ ఉద్యమం పట్ల జాగరూకతను కలిగించింది.

ఐవైఎం తన ఆశయ సాధనగా యువతలో నైతికతను పెంపొందించడం, వారిలోని సామర్థ్యాలను వెలికితీసి నైతిక సమాజ నిర్మాణానికి బాటలు వేయడం కొరకు రాష్ట్ర వ్యాప్తంగా అవిరళ కృషి చేస్తోంది.

2021లో అమీరె హల్ఖా ముహమ్మద్ రఫీఖ్ గారు 2021-23 కాల వ్యవధి కొరకు సయ్యద్ ఇబ్రాహీం షరీఫ్‌ను ఐవైఎం రాష్ట్ర బాధ్యునిగా నియమించారు. అనంతరం 2021-23 కాల వ్యవధి కొరకు ఐవైఎం ఏ.పీ జోన్ రాష్ట్ర కార్యవర్గం తమ పాలసీ ప్రోగ్రాం 5 విభాగాల్లో సిద్ధం చేసి దానికనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఐవైఎం బలోపేతం కొరకు, దాని అమలు కొరకు యువతను సన్నద్ధం చేస్తూ శరవేగంగా రాష్ట్ర వ్యాప్తంగా తన కార్యక్రమాలను నిర్వహిస్తూ ముస్లిం యువతకు మరింతగా చేరువ అయ్యిందని రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాహీం షరీఫ్ తెలియజేశారు.

కరోనా విపత్కర కాలంలోను తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఐవైఎం సమాజ సేవలో చేసిన కృషి చరిత్రాత్మకమైనదిగా ఇబ్రాహీం పేర్కొన్నారు. ఒక్క విజయవాడ నగరంలోనే ప్రతీ రోజు 500 మందికి భోజన ఏర్పాటు చేయడమే కాకుండా హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నవారికి సైతం వారి అవసరా లకు అనుగుణంగా యువత తమ సేవలను కోవిడ్ సమయంలో రాష్ట్ర ప్రజలకు అందించింది. ఈ తరుణంలోనే ఐవైఎం విశేష సేవలకు అనంతపురంలో 2022లో యూత్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన యువజన దినోత్సవం సందర్భంగా ఉత్తమ సమాజ సేవ పురస్కారాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు హాజీపీరా అందుకోవడం జరిగింది. ఒక సామాజిక సేవ మాత్రమే కాకుండా ఇస్లామీయ ధార్మిక విధులు, క్రమశిక్షణ, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, పౌర సంబంధాలు వంటి విభాగాల్లోను ఐవైఎం ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పట్ల గళం వినిపించడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఇస్లామీయ ఉద్యమంలో ముస్లిం యువత ప్రాధాన్యతను మరింత క్రియాశీలం చేయడం కోసం విశ్వాసం, ప్రగతి, ఆత్మగౌరవం అనే నినాదంతో ఐవైఎం విజయవాడ వేదికగా రెండు రోజుల రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తుందని ఇబ్రాహీం తెలియజేశారు. ఈ మహాసభలకు జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదతుల్లా హుసైనీ గారు ముఖ్యఅతిధిగా విచ్చేస్తు న్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఇబ్రాహీం మాట్లాడుతూ ముస్లిం యువతరం నేడు ఇస్లాంపై ఉన్నటువంటి అపోహలను దూరం చేయడానికి నిజమైన ఇస్లామీయ భోధనలను ప్రజలకు తెలియ జేయడానికి సమాయత్తం కావలసిన అవసరం ఉందని అన్నారు. ముస్లిం యువకుల సామర్థ్యాల వెలుగులో వారిని సమాజంలో ధార్మికంగా, నైతికంగా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది యువతను నవసమాజ నిర్మాణంలో భాగస్వాములు చేయడానికి ఐవైఎం ఈ మీఖాత్‌లో యువతతో నవసమాజ నిర్మాణ దిశగా అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రయత్నాలు చేస్తుందని, అందులో భాగంగానే జనవరిలో నిర్వహించే మహాసభ ద్వారా ఐవైఎం యువతకు మరింత చేరువ కావడానికి కృషి చేయడం జరుగుతుందని ఇబ్రాహీం అన్నారు. ఈ కార్యక్రమానికి ముస్లిం యువకులందరినీ ఐవైఎం సాదరంగా ఆహ్వానిస్తుందని ఇబ్రాహీం తెలియజేశారు.

**- ఇబ్రాహీమ్, మండపేట**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**